ప్రజాశక్తి
శుక్రవారం 29 సెప్టెంబర్ 2023
8 పేజీలు
ఎన్‌టిఆర్
కృష్ణా







సభలో మాట్లాడుతున్న గుమ్మా సాంబశివరావు

సమసమాజం కోసం శ్రమించిన జాషువా

- జయంతి సభలో ప్రముఖులు
- ముగిసిన 'యువతరంగం' నాటిక పోటీలు

ప్రజాశక్తి - విజయవాడ : కుల మతాలు లేని సమసమాజ నిర్మాణాన్ని కోరుకున్న విశ్వనరుడు జాషువా అని పలువురు ప్రముఖులు కొనియాడారు. నగరంలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో జరుగుతున్న యువతరంగం ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని కళాశాలలు, యూనివర్సిటీల స్థాయి యువనాటికల పోటీలు గురువారం విజయవంతంగా ముగిశాయి. చివరిరోజు గురువారం న్యూ స్టార్ మోడ్రన్ థియేటర్స్ విజయవాడ వారి 'కపిరాజు' నాటిక, అనంతరం నవరస థియేటర్ ఆర్ట్స్ విశాఖపట్నం వారి 'ముళ్లతీగలు' నాటిక, మంగళగిరి డాన్ బాస్కో స్కూల్ విద్యార్థులు 'శకుంతలోపాఖ్యానం' నాటికలు ప్రదర్శించారు. అనంతరం గుర్రం జాషువా 128వ జయంతి సభ నిర్వహించారు. నిమ్మగడ్డ కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో సాహితీవేత్త డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ జాషువాను అవమానించిన ఉన్నత వర్గాలవారే ఆ తర్వాత ఆయనను పొగిడారన్నారు. దారిద్ర్యం, అస్పృశ్యతపై ఆయన చేసిన రచనలు సమాజాన్ని మేల్కొల్పుతాయన్నారు. సమాజంలో కూడు, గూడు, గుడ్డ ప్రతిఒక్కరికీ ఉండాలని ఆకాంక్షించారని (మిగతా 6లో)

నేడు నగరంలో సిఎం సభ

'వాహనమిత్ర' నిధులు జమకు ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ దినకర్

ప్రజాశక్తి - భవానీపురం : రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి శుక్రవారం విజయవాడలో జరిగే 'వాహనమిత్ర' కార్యక్రమానికి హాజరుకానున్నారు. విద్యాధరపురం ఆర్‌టిసి డిపో సమీపంలోని మినీ స్టేడియంలో ఐదో విడత వైఎస్ఆర్ వాహన మిత్రను ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, విఎంసి కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు గురువారం మినీ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా స్వాగత ద్వారం ఏర్పాటు చేశారు. సభా వేదికను సిద్ధం (మిగతా 6లో)

ఆటో, మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

సిఎంకు సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ బహిరంగ లేఖ

ప్రజాశక్తి - విజయవాడ : ఆటో, మోటారు కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతోపాటు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నేతలు విజ్ఞప్తి చేశారు. విద్యాధరపురంలో శుక్రవారం జరిగే వాహనమిత్ర సభకు విచ్చేస్తున్న సిఎంకు యూనియన్ గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్, నగర ప్రధాన కార్యదర్శి కె.దుర్గారావు, నాయకులు బి.రూబెన్‌కుమార్, దుర్గావలి ఆటో, మోటారు కార్మికుల సమస్యలపై బహిరంగ లేఖ రాశారు. ఈ లేఖ సారాంశం ఇలా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా ఆటో, ట్యాక్సీ, టాటా మ్యాజిక్, టాటా గూడ్స్, లారీ వాహన రంగాలపై లక్షలాదిమంది ఆధారపడి జీవిస్తున్నారు. డిగ్రీ, బీటెక్ వంటి పెద్ద చదువులు చదివిన యువకులు ఉద్యోగాలు లేక మోటారంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఇటువంటి కార్మికులను ప్రోత్సహించి జీవనాధారం చూపించాలి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాహన మిత్ర పథకం ఆటో యజమానులకు కొంత ఊరటగా ఉంది. అయితే ఈ పథకాన్ని ఆటో డ్రైవర్లకూ వర్తింప చేయాలి. మొట్టమొదట వాహన మిత్ర పథకం ఎటువంటి ఆంక్షలు లేకుండా మంజూరు చేశారు. కానీ గత మూడేళ్ల నుండి విద్యుత్ వినియోగం 300 యూనిట్లు దాటిందని, కార్మికుల ఇళ్లల్లో కొంతమందికి ఇతర సంక్షేమ పథకాలు వస్తున్నాయని, ఐటి రిటర్న్ ఉందని, 100 గజాల ఇళ్ల స్థలం ఉందని తదితర కారణాలతో అనేక మందికి వాహన మిత్ర పథకాన్ని రద్దు చేశారు. కేంద్రం తీసుకువచ్చిన 2019లో మోటార్ వెహికల్ చట్ట సవరణ బిల్లును ఆమోదించి రాష్ట్రాలకు పంపింది. దీనిని మన రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తూ జిఒ నెంబర్ 21 తీసుకొచ్చి మోటారు రంగ కార్మికులపై వేలాది రూపాయలు జరిమానాలు విధిస్తున్నారు. ఈ జిఒను రద్దు చేయాలి. కార్మికులు ప్రమాదాలకు గురైనప్పుడు ప్రభుత్వ పరంగా ఎటువంటి నష్టపరిహారం ఇవ్వడంలేదు. అందువల్ల ఆటో, మోటారు రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి 60 ఏళ్లు దాటిన వారికి ప్రభుత్వం ద్వారా నెలకు రూ.5 వేలు పింఛన్ ఇవ్వాలి. ఆటోల కొనుగోలుకు ప్రభుత్వ బ్యాంకుల ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేయాలి. కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేసి అర్హులందరికీ ఇళ్లు కేటాయించాలి.

అభివందనాలతో
విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు)

యూరియా...ధరాభారం!

- ఆర్‌బికెల్లో నిండుకున్న నిల్వలు
- కీలక సమయంలో కొరత

ప్రజాశక్తి - కష్ణాప్రతినిధి

కృష్ణాజిల్లా ఘంటసాల మండలం చిట్టూర్పుకు చెందిన ఓ రైతు యూరియా కోసం గ్రామంలోని రైతు భరోసా కేంద్రం వద్దకు వెళ్లాడు. అయితే అక్కడ నోస్టాక్ అని చెప్పడంతో సమీపంలో గల కొడాలి గ్రామంలోని ఓ ప్రైవేటు దుకాణదారుడిని సంప్రదించాడు. అక్కడా స్టాక్ లేదని చెప్పడంతో అక్కడి నుంచి చల్లపల్లి వెళ్లాడు. తొలుత స్టాక్ లేదని చెప్పిన దుకాణ యజమాని ఆ తర్వాత అధిక ధర చెల్లిస్తే ఇస్తామని చెప్పాడు. 45 కిలోల యూరియా బస్తాను రైతు భరోసా కేంద్రాల్లో రూ.270కు విక్రయిస్తుంటే..చల్లపల్లి దుకాణదారుడు యూరియా కొరతను ఆసరా చేసుకుని బస్తాకు రూ.350 వసూలు చేశాడు. ఒక్కో బస్తాకు ఆ రైతు రూ.80 అదనంగా చెల్లించి యూనియా కొనుగోలు చేయాల్సి వచ్చింది. కానీ ఆ దుకాణదారుడు బిల్లు మాత్రం



రూ.266.50కే ఇచ్చాడు. యూరియాను అధిక ధరకు విక్రయిస్తున్న పరిస్థితి ఒక్క చల్లపల్లిలోనే కాదు...జిల్లావ్యాప్తంగానూ నెలకొంది.

జిల్లాలో 3.85 లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేశారు. అత్యధిక విస్తీర్ణంలో వరి నాట్లు పూర్తయి 60 రోజులు కావస్తోంది. వరి కంకి ఏర్పడే ముందు దశ (చిగురు)కు చేరుకుంది. పొలంలో దుబ్బు చేసి కలుపు తీసిన తర్వాత, చిగురు మూడు దశల్లో తగిన మోతాదులో కాంప్లెక్స్, పొటాష్ ఎరువుల్లో కలిపి యూరియాను పిచికారీ చేయాల్సి ఉంటుంది. అప్పుడే దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి. ఎరువుల వినియోగం ఆలస్యమైతే దిగుబడులు తగ్గిపోతాయి. అయితే కీలక సమయంలోనే యూరియా అందుబాటులో లేకుండా పోయింది. యూరియా కోసం రైతు భరోసా కేంద్రాలు, దుకాణాల చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేయాల్సివస్తోంది.

సలహా మండలి మాటలు నీటి మూటలు

15 రోజుల క్రితం జరిగిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో యూరియా కొరతను సభ్యులు ప్రస్తావించారు. కీలక సమయంలో యూరియా కొరత లేకుండా రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈసూచనలు అక్కరకు రాలేదు. రైతులు ప్రయివేట్ డీలర్ల వద్దే ఎరువులను కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఫలితంగా రైతులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. 2021-22 వ్యవసాయ సీజన్ ఏప్రిల్ - సెప్టెంబర్ మధ్య జిల్లాలో 62,909 టన్నుల యూరియా గోదాముల్లో ముందస్తు నిల్వలున్నాయి. 2023-24 సీజన్లో అదనపు నిల్వలు అందుబాటులో లేవు. ఈ క్రమంలోనే కొరత ఏర్పడినట్లు తెలిసింది. దీన్ని ఆసరా చేసుకుని ప్రయివేటు వ్యాపారులు రైతులను అడ్డగోలుగా దోపిడీ చేస్తున్నారు. కొరతను నివారించలేని అధికారులు...యూరియా ధరనూ నియంత్రించలేకపోవడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



స్వామినాథన్ జ్ఞాపకాలు...

2011 డిసెంబరు 23న విజయవాడలో డాక్టర్ పిన్నమనేని, శ్రీమతి సీతాదేవి ఫౌండేషన్ ఏర్పాటు చేసిన 21వ వార్షిక అవార్డుల ప్రదానోత్సవంలో అవార్డును స్వీకరిస్తున్న ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్.స్వామినాథన్ (పాతచిత్రం)

వార్తలు లోపలి పేజీల్లో



విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎలు విష్ణు, వెలంపల్లి

ఘనంగా జాషువా జయంతి వేడుకలు

స్వామినాథన్ మృతి రైతాంగానికి తీరనిలోటు

ప్రజాశక్తి-వన్‌టౌన్

ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, హరిత విప్లవానికి పితామహుడు ఎమ్మెస్ స్వామినాథన్ మృతి తీరని లోటని రాకేష్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ ఎన్.వి. రావు అన్నారు. స్వామినాథన్ ఆకస్మిక మరణంకు చింతిస్తూ పశ్చిమంలోని కెఎల్ రావు నగర్‌లో గల రాకేష్ పబ్లిక్ స్కూల్‌లో గురువారం సంతాప సభ నిర్వహించి, స్వామినాథన్ చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రభుత్వ ఉపాధ్యాయిని కె.రేణుకా దేవి, పాఠశాల డైరెక్టర్ ఎన్.వి. రావు పాల్గొని పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఎన్.వి. రావు మాట్లాడుతూ స్వామినాథన్ విజయవాడ వచ్చినప్పుడు ఆయన్ను కలిసి అనుభవాలను గుర్తు చేసుకున్నారు. ప్రపంచంలో ఆకలి, పేదరికం తగ్గించటంపై ఆయన దష్టి పెట్టి ఎన్నో మేలు రకాలైన వరి, గోధుమ వంగడాలను పరిశోధించటం వలనే నేడు అందరికి ఆహార పదార్థాలు లభ్యమౌతున్నాయని



రాకేష్ పబ్లిక్ స్కూల్లో

తెలిపారు. అలాగే పర్యావరణానికి హాని కలిగించని ఉత్పత్తిని సాధించి పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మ విభూషణ్ అవార్డులను పొందటమే గాక, 84 గౌరవ డాక్టరేట్‌లను పొంది, భారత పార్లమెంట్‌కు 2007- 2013 వరకు నామినేట్ చేయబడి అవిరాళ కషి చేసిన మహానుభావుడని శ్లాఘించారు. అనంతరం ప్రభుత్వ ఉపాధ్యాయిని రేణుకా నేతి, ఉపాధ్యాయులు మల్లేశ్వరి, మమత, సురేఖ, ఝాన్సీ, ప్రవంతి, రమేష్, ప్రదీప్ తదితరులు పాల్గొని ఆయన జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. ఆయన మరణం దేశానికి తీరని నష్టమని ఎన్.వి. రావు ఈ సందర్భంగా తెలిపారు.

ప్రజాశక్తి- నందిగామ: ప్రొఫెసర్ ఎంఎస్ స్వామినాథన్ మృతికి కౌలురైతుల సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు గురువారం సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ ఎంఎస్ స్వామినాథన్ భారతదేశ రైతాంగానికి దిక్సూచిగా ఉంటూ దేశ ప్రజలకు అన్నం పెట్టారన్నారు. వ్యవసాయ రంగం సంక్షోభాన్ని నివారించాలన్నా, రైతుల ఆత్మహత్యలు నిలువరించాలన్నా, వ్యవసాయ రంగాన్ని రక్షించాలంటే రైతులు పెట్టిన పెట్టుబడి కలిపి 50 శాతం అదనంగా గిట్టుబాటు రేటు ఇవ్వాలని, భారతదేశ ప్రభుత్వానికి విలువైన సిఫారసు చేసిన ఎంఎస్ స్వామినాథన్ మృతి దేశ రైతాంగానికి తీరనిలోటన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-గంపలగూడెం: ప్రజల అవసరాలు తీర్చడమే తమ ప్రభుత్వ ధ్యేయమని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణ నిధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తెలిపారు. గురువారం మండల కేంద్రమైన గంపలగూడెంలో పలు అభివద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటైన సభలో రక్షణనిధి మాట్లాడుతూ తాము గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా పర్యటించిన సందర్భంలో వచ్చిన సమస్యలను గుర్తుపెట్టుకున్నట్లు తెలిపారు. తూర్పు, పడమర దళితవాడల్లో ప్రధానంగా మంచినీటి విస్తరణ, అంతర్గత రహదారుల సమస్యలు, తమ దష్టికి వచ్చినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో 40 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేసినట్లు వివరించారు. వీటికి తోడు మరో 10 లక్షలు ఉపాధి హామీ పథకం ద్వారా లభించినట్లు వివరించారు. ఈ నిధులతో మండల ఆఫీస్ ఎదురుగా ఉన్న కట్టలేరు సమీపంలో మంచినీటి బోరుబావి, మంచినీటి పైపులైన విస్తరణకు, అనంతరం ఎన్టీఆర్ కాలనీలో సిసి రహదారులకు శంకుస్థాపన చేశారు.

స్వర్ణోత్సవాలను జయప్రదం చేయండి : యుటిఎఫ్

ప్రజాశక్తి-నందిగామ: యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా నందిగామ యుటిఎఫ్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు యుటిఎఫ్ స్వర్ణోత్సవాల జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని యూటీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కోశాధికారి ఎం. వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన నందిగామలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ సందర్భంగా నందిగామ పట్టణ పురవీధుల్లో యుటిఎఫ్ రాష్ట్ర మహాజాత ప్రదర్శన జరుగుతుందని తెలిపారు. మహాజాత ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరారు.

వేదాద్రిలో బహిరంగ వేలం పాట

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: వేదాద్రి గ్రామంలోని శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానముకు సంబంధించి కొబ్బరి కాయలు బి కిరాణా సామాగ్రి అమ్ముకొను లైసెన్సునకు ఒక్క సంవత్సర కాలపరిమితికి గురువారం షేర్ మోహమ్మద్ గ్రూప్ దేవస్థానముల కార్యనిర్వహణాధికారి సి.హెచ్.హరిదుర్గనాగేశ్వరరావు పర్యవేక్షణలో దేవస్థాన ప్రాంగణము నందు సీల్డ్ టెండరు కం-బహిరంగ వేలము పాటలు నిర్వహించారు. ఈ వేలం పాటలో అత్యధికంగా రూ.30.25 లక్షలకు తుమాటి బాజీబాబు దక్కించుకున్నారు.

యోగా తరగతులు

ప్రజాశక్తి-నందిగామ: నందిగామలో శ్రీ చైతన్య ఈ - టెక్నో స్కూల్ లో ప్రిన్సిపాల్ గుత్త ప్రదీప్ వారి ఆధ్వర్యంలో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా గురువారం విద్యార్థులు యోగా ఆసనాలు చేశారు. 6, 7, 8 తరగతులకు చెందిన వంద మంది విద్యార్థులకు పైగా ఈ యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గురువు గాడిపర్తి సీతారామారావు తదితరులు పాల్గొన్నారు.

అమెజాన్‌కు ఆదరణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: రానున్న పండుగల సందర్భంగా అమెజాన్ ద్వారా షాపింగ్ చేయడానికి ఎక్కువ మంది ఇష్ట పడుతున్నారని, అత్యంత విశ్వసనీయ బ్రాండ్‌గా అమెజాన్ ఉందని సంస్థ ప్రతినిధి ఎన్.సుబ్రహ్మణియన్ తెలిపారు. ఈ సందర్భంగా అమెజాన్ సంస్థ కార్యాలయం నందు ఆయన మాట్లాడుతూ వినియోగదాలు ఈపండుగ సీజన్‌లో ఆన్‌లైన్ షాపింగ్ చేయడానికి ఆసక్తి చూపుతున్నారని ఇందులో భాగంగానే ప్రత్యేక ఆఫర్లు కూడా అందిస్తున్నారని పేర్కొన్నారు. పండుగ షాపింగ్‌ను సంతోషంగా గడిపేఉద్దేశంతో ప్రత్యేక ఆఫర్లతో పాటు, సత్వరమే సేవలను అందిస్తున్నట్లు తెలిపారు.

2 నుండి జీ తెలుగులో వినూత్న కార్యక్రమం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ప్రేక్షకులకు వినోదంతో పాటు విజ్ఞానాన్ని అందిస్తున్న జీ తెలుగు ఛానల్‌లో అక్టోబరు 2వ తేదీ నుండి ప్రత్యేక కార్యక్రమం సీతే రాముడి కట్నం ప్రారంభిస్తున్నట్లు ఛానల్ ఆన్‌ఛార్జి ధన శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎప్పటికపుడు వినూత్నమైన కార్యక్రమాలను అందిస్తున్న జీ ఛానల్ సరికొత్తగా ప్రతిరోజూ మధ్యాహ్నం 12.30 గంటలకు ఈకార్యక్రమం ప్రసారమవుతుందని తెలిపారు. ఆసక్తికరమైన కథ, కథనంతో అత్తా కోడళ్ల మధ్యా సాగే వినూత్న కార్యక్రమంగా సీతే రాముడి కట్నం రూపొందించినట్లు తెలిపారు.



గాంధీ సెంటర్‌లో విగ్రహాలను పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

గాంధీ సెంటర్లో విగ్రహాల పరిశీలన

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ గాంధీ సెంటర్‌లో విగ్రహాల ఏర్పాటులో అధికారులు, అధికార పార్టీ నాయకులు ప్రభుత్వ నియమ నిబంధనలు ఉల్లంఘించారని నందిగామ మాజీ ఎంఎల్‌ఎ తంగిరాల సౌమ్య ఆరోపించారు. పట్టణం గాంధీ సెంటర్ నందు నూతనముగా ఏర్పాటు చేయనున్న మహాత్మా గాంధీ గవిగ్రహాన్ని పరిసర ప్రాంతాలను పట్టణ తెదేపా కౌన్సిలర్లు మరియు తెదేపా నేతలతో కలిసి మాజీ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ మహాత్మా గాంధీ, అంబేద్కర్ లాంటి వారి విగ్రహాలను పెట్టేటప్పుడు అవసరమైన ప్రభుత్వ చట్టబద్ధమైన అనుమతులను నియమ నిబంధనలను పాటించడం కనీస బాధ్యత అన్నారు. తక్షణమే అఖిలపక్ష సమావేశం పెట్టి గాంధీ విగ్రహాన్ని ఎక్కడ, ఎలా పెడితే బాగుంటుంది అన్న విషయంపై ప్రజలు,నిపుణుల, ప్రజా సంఘాల అభిప్రాయాన్ని తీసుకోవాల్సిందిగా డిమాండ్ చేశారు. అలా కాకుండా ఏకపక్ష నిర్ణయాలతో మీరు ఇదే విధంగా ముందుకెళ్తే తప్పక ప్రజాగ్రహానికి గురి కావలసి వస్తుందని హెచ్చరించారు.



రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు

జడ్‌పిటిసి సౌజన్య

ప్రజాశక్తి-కంచికచర్ల: జడ్పీటీసీగా రెండేళ్లలో జిల్లా పరిషత్ నుండి రూ.20 లక్షలతో మండలంలో నాలుగు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసినట్లు వీరులపాడు జడ్పీటీసీ ఆమర్లపూడి కీర్తి సౌజన్య అన్నారు. వీరులపాడు జడ్పీటీసీగా ఎన్నికై రెండేళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం కంచికచర్లలోని తన స్వగృహంలో మీడియాతో ఇష్టాగోష్టి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నందిగామ నియోజకవర్గం నుండి 2024 ఎన్నికల్లో వైసిపి టికెట్ ఆశిస్తున్నట్లు వస్తున్న వార్తలు అవాస్తమన్నారు. అయితే జగన్ ఆదేశిస్తే తప్పకుండా పోటీ చేస్తానని చెప్పారు.

విద్యుత్ భారాలపై ధర్నా

ప్రజాశక్తి-తిరువూరు: విద్యుత్ వినియోగదారులపై మోపుతున్న అదనపు భారాలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం తిరు వూరు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, విని యోగదారులు తిరువూరు బోసుబొ మ్మ సెంటర్లో గురువారం ధర్నా నిర్వహించారు. ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో, ఏరియస్ పేరుతో, సర్దుబాటు పేరు తో రాష్ట్ర ప్రభుత్వం గహ విద్యుత్ వినియోగదారులపై మోపుతున్న అదనపు కరెంట్ చార్జీలు తగ్గించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ఎం.నాగేంద్ర ప్రసాద్, మండల కార్యదర్శి సాంబారు వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు గుళ్లపల్లి వెంకటరత్నం, నాయకులు పంతంగి



శ్రీనివాసరావు, బి.వేంకటేశ్వరరావు, ఆకుల రవి, కడిమి పాపారావు, నాగులమీరా, పాకాల రామకృష్ణ, కె.రాము, ఎం.నర సింహారావు, కె.వి.రత్నం, చప్పిడి సురేష్, జెట్టి శ్రీనివా సరవు, చెరుకు మోహన్‌కృష్ణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ముందుకు సాగని సచివాలయాల నిర్మాణం

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ నియోజకవర్గంలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు నిర్మాణాలు మొక్కుబడిగా సాగుతున్నాయి. పనులు నత్త నడక సాగుతున్న ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోవడం లేదు. ఎన్నికలు సమీపిస్తున్న పాలకులు ఇచ్చిన హామీలు పూర్తి కావటం లేదు.

నందిగామ నియోజవర్గంలో 63 సచివాలయాలకు 30 సచివాలయాలు పూర్తికాగా 24 సచివాలయాలు నిర్మాణంలో ఉన్నాయి 9 సచివాలయాలు ఇంకా నిర్మాణ పనులు చేపట్లేదు. 65 ఆర్బీకే కేంద్రాలు మంజూరు గాక వచ్చింది ఆర్బి కి కేంద్రాలు పూర్తయినాయి 17 ఆర్బిక్కి కేంద్రాలు నిర్మాణంలో ఉన్నాయి 30 ఆర్బీకెలు నిర్మాణ పనులు జరగటం లేదు. 49 ఆరోగ్య ఉప కేంద్రాలు మంజూరు కాగా 9 ఆరోగ్య ఉప కేంద్రాలు పూర్తయినాయి 23 నిర్మాణంలో ఉన్నాయి 17 పనులు చేపట్టవలసి ఉన్నాయి. ఈ భవనాలు పూర్తిగా అందుబాటులోకి రాకపోవడంతో ప్రైవేట్ భవనాల్లో వసతులు లేక ప్రజలు ఉద్యోగం ఇబ్బందులు పడుతున్నారు. సచివాలయం పనులు చేపట్టిన భవనాలకు బిల్లులు సకాలంలో అందడం లేదు నిధులు విడుదలైన పనులు ముందుకు సాగటం లేదు రెండేళ్ల కిందట వేసిన అంచనాల మేరకు నిధులు మంజూరు చేస్తున్నారు ప్రస్తుతం మెటీరియల్ ధరలు పెరిగిన నేపథ్యంలో ఆ నిధులు సరిపోవడం లేదని కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతూ వెనకాడుతున్నారు ఉన్నతాధికారులు కిందిస్థాయి సిబ్బందిపై ఒత్తిడి చేస్తున్న ఫలితం లేకపోయింది. నందిగామ నియోజవర్గంలో సచివాలయాలు రైతు భరోసా కేంద్రాలు ఆరోగ్య ఉప కేంద్రాలు మొత్తం 177 మంజూరు కాగా ఇప్పటివరకు 57 భవనాల నిర్మాణం పూర్తి జరిగింది 64 భవనాల నిర్మాణాలు నిర్మాణ దశలో ఉండగా 56 చోట్ల పనులు మొదలుపెట్టలేదు.

నందిగామ మండలం అడవిరావులపాడు గ్రామంలో సచివాలయం భవనం నిర్మాణంకు శంకుస్థాపన చేసి ఇంతవరకు పనులు మొదలు పెట్టలేదు. నందిగామ మండలం పల్లగిరి గ్రామంలో పోలాలలో మధ్య లో నిర్మిస్తున్న సచివాలయం భవన నిర్మాణ పనులు నిధులు కొరతతో సగంలోనే నిలిచిపోయాయి. చందర్లపాడు, అంబారుపేట గ్రామాల్లో హెల్త్ క్లినిక్లు పాఠశాల ఆవరణలో ఉండటంతో పనులు నిలిపివేశారు. మరికొన్ని చోట్ల నిర్మాణ దశలో ఉన్నాయి. భవనాల నిర్మాణం చేపట్టి బిల్లులు రాక అప్పుల పాలై కంటే పనులు చేపట్టకుండా ఉండడమే మేలని కాంట్రాక్టర్లు చర్చించు కుంటున్నారు. కంచికచర్ల మండలం పెండ్యాల గణాత్మ్కార్ గ్రామాల్లో సచివాలయ భవనాలు నిర్మాణం మొదలుపెట్టి మధ్యలో నిలిపివేశారు. వీరులపాడు మండలం నరసింహారావు పాలెం, చౌటుపల్లి గ్రామాల్లో



పల్లగిరి గ్రామంలో నిర్మాణం ఆగిపోయిన సచివాలయం

ఇదే పరిస్థితి నెలకొంది.

పెరిగిన మెటీరియల్ ధరలు

సచివాలయం భావన నిర్మాణాలకు వంద శాతం ఉపాధి హామీ పథకం నిధులు రూ. 40 లక్షలు, రైతు భరోసా కేంద్రానికి 90 శాతం ఉపాధి హామీ పది శాతం వ్యవసాయ శాఖ నిధులు రూ. 21.80 లక్షలు ఆరోగ్య ఉప కేంద్రానికి 50 శాతం చొప్పున 17.5 లక్షలు కేటాయించారు. అప్పటి ధరలు ప్రకారం నిధులు కేటాయించారు. ప్రస్తుతం నిర్మాణ సామగ్రి ధరలు పెరగడంతో భవనాల పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ప్రభుత్వ భవనాలు నిర్మాణ బిల్లులు పెండింగ్లో లేవని ప్రస్తుతం నిధులు వేగవంతంగా మంజూరు అవుతున్నాయని అయా మండల పంచాయతీరాజ్ శాఖ ఎఇలు పేర్కొంటున్నారు. కాంట్రాక్టర్లకు అవగాహన కల్పిస్తున్నారు .త్వరగా భవనాల నిర్మాణ పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామని నందిగామ పంచాయతీరాజ్ శాఖ డీఈ శ్రీనివాసరావు పేర్కొన్నారు.

జాషువా రచనలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

జయంతిలో పలువురు వక్తలు




మచిలీపట్నంలోని కెవిపిఎస్ ఆధ్వర్యంలో



కలెక్టరేట్‌లో...



గుడివాడలో...



పెదపారుపూడిలో...

ప్రజాశక్తి-కలెక్టరేట్(కృష్ణా) : మతోన్మాద ,కులతత్వ విధానాలకు వ్యతిరేకంగా మహాకవి గుర్రం జాషువా రచనలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కులవక్ష వ్యతిరేక పోరాట సంఘం కృష్ణా జిల్లా అధ్యక్షులు సిహెచ్ రాజేష్, ఉపాధ్యక్షులు కొడాలి శర్మ, ఐసిఇయు మచిలీపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి జి కిషోర్ కుమార్ లు పేర్కొన్నారు. మహాకవి గుర్రం జాషువా 128 జయంతి సందర్భంగా కెవిపిఎస్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక జ్యోతిరావు పూలే విజ్ఞాన కేంద్రం లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాషువా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవితంలో ఎన్నో అవమాన సంఘటన ఎదుర్కొన్న జాషువా ఆ అవమానియా సంఘటనలతో తన రచనలతో మానవయ్య దక్పథంతో రచనలు చేశారని నేటి పాలకవర్గాలు ప్రజల మధ్యన చీలికలు తీసుకొచ్చి మతపరంగా కుల పరంగా ప్రజల మధ్య ప్రయత్నిస్తుందని ఈ దేశ రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని సామాజిక న్యాయాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ముఖ్యంగా కేంద్రంలోని బిజెపి పూర్తిగా మనువాద సిద్ధాంతంతో ప్రజల్ని మధ్యయుగాల వైపు తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తుందని దీనికి వ్యతిరేకంగా ప్రజలందరినీ ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయాలని అదే జాషువా కి నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బూర సుబ్రహ్మణ్యం, ఎం.పోలి నాయుడు, జయ రావు, ఎల్ఐసి నాయకులు టీ చంద్ర పాల్, పూలే విజ్ఞాన కేంద్ర కన్వీనర్ పామర్తి నాగయ్య ,మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి జ్యోతి ,విజయలక్ష్మి, మరియు ఈడే రామారావు తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత కవి గుఱ్ఱం జాషువా : జాయింట్ కలెక్టర్

ప్రముఖ తెలుగు కవి గుఱ్ఱం జాషువా అణగారిన ప్రజల ఆత్మగౌరవం కోసం పాటుపడిన గొప్ప వ్యక్తి, నేటి తరానికి స్ఫూర్తి ప్రదాత అని జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ పేర్కొన్నారు. గురువారం నవయుగ కవి చక్రవర్తి గుఱ్ఱం జాషువా జయంతి సందర్భంగా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జాయింట్ కలెక్టర్ ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తన సాహిత్యంతో సమాజంలోని మూఢాచారాలు, వర్గ సంఘర్షణ, ఆర్థిక అసమానతలపై పోరాడిన అభ్యుదయ వాది గుఱ్ఱం జాషువా అని ఈ సందర్భంగా జేసీ కొనియాడారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ, జిల్లా కలెక్టరేట్ ఏవో రాధిక, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.అలాగే జిల్లా వెనుకబడిన తరగతుల సేవ సహకార సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈడి శ్రీనివాసరావు,మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.అదేవిధంగా జిల్లా సహకార శాఖ కార్యాలయంలో జరిగిన వేడుకలలో జిల్లా సహకార అధికారి పివి ఫణి కుమార్,మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. పశు సంవర్ధక కార్యాలయం లో జరిగిన కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి.డాక్టర్ డి.శ్రీనివాస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం(ఉంగుటూరు) :** గుర్రం జాషువా 128 వ జన్మదిన వేడుకలు మండల పరిషత్ ఉంగుటూరు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో సిజిఎస్‌వి శేషగిరిరావు, ఇందుపల్లి పంచాయతీ సెక్రెటరీ బి కోటేశ్వరరావు వాలంటరీలు, ఎస్ఐ పాల్గొన్నారు.

విశ్వ మానవ సమానత్వం కోసం కృషి చేసిన జాషువా

ప్రజాశక్తి-చల్లపల్లి : తన రచనల ద్వారా సమాజంలో మానవుల మధ్య సమానత్వం కొరకు నిరంతరం కషిచేసి గుఱ్ఱం జాషువా చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు తెలిపారు. చల్లపల్లిలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవా సదన్ నందు జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జి. కోటేశ్వరరావు తదితర నేతలు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-పెదపారుపూడి :** పెదపారుపూడి మండల పరిషత్ కార్యాలయంలో గుర్రం జాషువ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో యద్దనపూడి. రామకష్ణ జాషువా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యుపిఆర్‌డివి శ్రీనివాస్, సూపర్డెంట్ ఎస్‌వి రమణారావు, సీనియర్ అసిస్టెంట్ ఎస్.కె మెహన్నీపా బేగం పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడివాడ :** పద్మభూషణ్ గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకొని గురువారం స్థానిక పురపాలక సంఘ కార్యాలయములో మునిసిపల్ కమిషనర్ వి.మురళీకష్ణ గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పక్కన నిలిపిఉంచిన కారు

నాలుగు రోజులుగా రోడ్డు పక్కనే కారు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం దావాజీ గూడెం వంతెన డౌన్ లో నిలిపే వుంచిన కర్ణాటక రిజిస్ట్రేషన్ తో ఉన్న కారుతో చుట్టుపక్కల ఉన్న జనాలు భయభ్రాంతులకు గురవుతున్నారు. నాలుగు రోజుల నుంచీ ఉందని చెపుతున్నారు. ఏదైనా రిపేర్ వచ్చి ఆగి ఉందా? లేదా? ఎవరైనా వదిలిసి వెళ్లిపోయారు అని చుట్టుప్రక్కల ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.పోలీసులకు సమాచారం అందించారు.

ఎంఎల్‌ఒ కమిటీని రద్దు చేయాలి



ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : ఏపి ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ కృష్ణా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అధికారుల జె ఏ సీ సమావేశం స్థానిక రిటైర్డు ఉద్యోగుల అసోసియేషన్ హాల్ నందు బుధవారం ఉమ్మడి కృష్ణా జిల్లా మాజీ అధ్యక్షులు వై శ్యాంకుమార్ అధ్యక్షతన జరిగింది. ముందుగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్ర పటాలనికి పూలమాల తో ఘనంగా నివాళులు అర్పించి సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ లకు సంబంధం లేని క్యాచ్ అప్ రూల్ ను తీసుకు వచ్చి ప్రమోషన్ లలో రిజర్వేషన్ లను ఎత్తివేసే ప్రక్రియ ను చేపట్టేందుకు ఎం ఎల్ ఓ కమిటీ వేయడం లాంటి చర్యలకు ప్రభుత్వం పాల్పడుతుందని, ప్రభుత్వం ఆ చర్యలను వెంటనే నిలిపి వేయాలని, ఎంఎల్ఓ కమిటీని రద్దు చేయాలని డిమాండ్ చేయడం జరిగినది.ఈ సమావేశంలో స్టేట్ గౌరవ చైర్మన్ పట్టపు శీనయ్య, కర్రా సునీల్ కుమార్,మద్దాల కష్ణ కుమార్, దాసి జయ ప్రకాష్, క్రాంతి కుమార్, రాజు, చప్పిడి చిట్టిబాబు, తూము వేంకటేశ్వర రావు లు మరియు వివిధ శాఖల లోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మండవ కృష్ణారావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-చల్లపల్లి : విశ్రాంత వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మండవ కృష్ణారావు నిబద్ధత, కార్యాచరణ కలిగిన అధికారి అని మాజీ ఎంపీ, శాసన మండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అన్నారు. చల్లపల్లి మండలం నడకుదురు పంచాయతీ నాదెళ్ల వారిపాలెంలో మండవ కష్ణారావు ప్రధమ వర్ధంతి పారిశ్రామికవేత్త, నడకుదురు శ్రీ పథ్వీశ్వర స్వామి దేవస్థాన సమగ్ర అభివద్ధి ప్రదాత మండవ రవీంద్ర ఆధ్వర్యంలో ఘనంగా గురువారం నిర్వహించారు. కష్ణారావు చిత్రపటానికి మాజీ ఎంపీ, శాసన మండలి చీఫ్ విప్, వైఎస్ఆర్ సీపీ కేంద్ర కమిటీ సీనియర్ నాయకులు డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, జడ్పీటీసీ సభ్యులు చింతలపూడి లక్ష్మీనారాయణ, మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధ ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ తెలంగాణ బరంపురం ఇన్ కం టాక్స్ ఆఫీసర్ కే వి ఎన్ చారి, ఏపీ అటవీ శాఖ చీఫ్ కన్జర్వేటర్ వై మధుసూదన్ రెడ్డి, అటవీ శాఖ మచిలీపట్నం రేంజ్ ఆఫీసర్లు ఫేక్ అసిఫ్ షరీఫ్ సిహెచ్ సుజాత కష్ణారావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా ఉమారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కృష్ణారావు వ్యవసాయ శాస్త్రవేత్తగా అనేక జిల్లాలో రైతు సంక్షేమానికి కషి చేశారన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తగా రాష్ట్రంలో ఉత్తమ సేవలు అందించారన్నారు.



కృష్ణారావుకు నివాళులర్పిస్తున్న దృశ్యం

కాల్వలో పడి వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి హనుమాన్‌జంక్షన్ : బాపులపాడు మండలం పెరికీడు గ్రామం వద్ద ఏలూరు కాలంలో పడి వృద్ధురాలు మృతి చెందింది. కాలువలో గుర్తు తెలియని మహిళా మృతదేహం ఉందని స్థానికులు హనుమాన్ జంక్షన్ పోలీసులకు సమాచారం అందించారు. జంక్షన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని స్థానికుల సహాయంతో మతదేహాన్ని బయటకు తీసి మతురాలి వివరాలు సేకరించారు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు పెరికీడు గ్రామానికి చెందిన పరిమి రామలక్ష్మి (67) ఉంగుటూరు మండలం చిన్నఅవుటపల్లి గ్రామంలో అతని కుమారుడు వద్ద ఉంటుంది. మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఇంట్లో నుంచి గత రాత్రి బయటికి వచ్చింది. కుటుంబ సభ్యులు ఆచూకీ కొరకు వెతికేలోపు ఏలూరు కాలంలో ఆమె శవమై కనిపించింది. మతురాలి కుమారుడు కోటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ టి.తిరుమలరావు కేసు నమోదు చేసి మతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



సుందరరావు భౌతికయంపై పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం నాయకుడు సుందరరావు మృతి

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం ముస్తాబాద్ గ్రామానికి చెందిన సిపిఎం నాయకుడు పాగోలు సుందరరావు (87) గురువారం మృతి చెందారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వై. నరసింహారావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లం వెంకటేశ్వరరావు, గన్నవరం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు, మండల పార్టీ నాయకులు అనుమో లు వెంకటేశ్వరరావు, కళ్ళం రాంబాబు, కైలే ఏసుదాసు, దాసి బాబురావు తదితరులు ఆయన భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామంలో జరిగిన పార్టీ పోరాటాల్లో సుందరరావు చురుకుగా పాల్గొనేవాడని, పార్టీ ఎడల అచంచలమైన విశ్వాసంతో ఉండేవారని నాయకులు తెలిపారు.

అభయాంజనేయస్వామికి సింధూర అభిషేకం

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ : హనుమాన్‌జంక్షన్ లో వేంచేసి ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో గురువారం జన్మ నక్షత్ర పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ వెనుక భాగంలో స్వామివారి ఉత్సవ విగ్రహానికి సింధూరంతో అభిషేక ఆలయ అర్చకులు శాస్రోక్తంగా నిర్వహించారు. ప్రతినెల అభయాంజనేయ స్వామి జన్మ నక్షత్రమైన పూర్వాభాద్ర నక్షత్రం సందర్భంగా అర్చన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. గురువారం నిర్వహించిన పూజా కార్యక్రమాలలో పలువురు భక్తులు పాల్గొని స్వామివారికి సింధూరంతో అభిషేకం చేశారు. పూజా కార్యక్రమాలు ముగిసిన అనంతరం భక్తులకు తీర్ధ ప్రసాదాలను అర్చకులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి కూచిపూడి శ్రీనివాస్, పాలకమండలి చైర్మన్ నెర్సు భూషణం పాల్గొన్నారు.

లడ్డు వేలం ధర రూ. 54 వేలు

ప్రజాశక్తి-గుడివాడ : స్థానిక మెయిన్ రోడ్డులో వేంచేసి యున్న శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానంలో గణపతి నవరాత్రి మహోత్సవాల ఉత్సవ లడ్డు వేలం పాటను దేవస్థాన కాలక్షేప మండపంలో గురువారం నిర్వహించారు. దేవదాయశాఖ అధికారుల సమక్షంలో నిర్వహించిన వేలం పాటలో ఎమ్మెల్యే కొడాలి నాని మిత్రులు వల్లూరుపల్లి సుధాకర్, కొల్లి విజయ్‌లు 54వేల హెచ్చు పాటకు లడ్డును దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ఈవో ప్రసాద్, సహాయకులు శ్రీనివాసరావు, ధర్మకర్తల కమిటీ చైర్మన్ గంటా చంద్రశేఖర్, మండలి హనుమంతరావు, చండురి శేఖర్, గిరిబాబాయ్, జ్యోతుల మణికంఠ, తదితరలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం కృష్ణాజిల్లా నాయకులు ఆర్.రఘు

ఆదర్శ కమ్యూనిస్టు వేణునాథం

సంస్మరణలో సభలో సిపిఎం నేతలు

విజయవాడ: కార్మిక ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటూ, విశాఖ బిహెచ్‌పివి పరిశ్రమలో పనిచేస్తూ జె.వేణునాథం ఆదర్శ కమ్యూనిస్టుగా నిలిచారని పలువురు సిపిఎం నేతలు అన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా పైడూరుపాడు గ్రామానికి చెందిన సిపిఎం శాఖ కార్యదర్శి జె.వేణునాథం సంస్మరణ సభ గురువారం జరిగింది. సభకు విజయవాడ రూరల్ మండలం కార్యదర్శి తాళ్లూరి నరసింహారావు అధ్యక్షత వహించగా సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.రఘు మాట్లాడుతూ కమ్యూనిస్టు విలువలతో పార్టీ అభివృద్ధికి వేణునాథం ప్రజలతో మమేకమై పని చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి ఆంజనేయులు, ప్రజా సంఘాల నాయకులు జి.సుబ్బారావు, ఎం.సత్యవతి, జంపాల శ్రీమన్నారాయణ, అసురకాంత్, ఆవుల వెంకట్రావు, సుధీర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

జైపూర్ 'రగ్ ఉత్సవ్' ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: హ్యాండ్‌మేడ్ రగ్గుల తయారీలో ప్రఖ్యాతి గాంచిన జైపూర్ రగ్స్ వార్షిక 'రగ్ ఉత్సవ్ 2023' ను ప్రారంభించినట్లు జైపూర్ రగ్స్ డైరెక్టర్ యోగేష్ చౌదరి తెలిపారు. ఈ సంవత్సరం రగ్ ఉత్సవ్ వినియోగదారులకు అసాధారణమైన అనుభవాన్ని అందిస్తుందన్నారు. ప్రత్యేక తగ్గింపులు, నేత కార్మికులతో ఇంటరాక్టివ్ సెషన్‌లు, జేఆర్ మెరిటోరియస్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్లు ఉన్నాయన్నారు. ధుర్రీస్, హ్యాండ్ టఫ్టెడ్, హ్యాండ్లూమ్ అండ్ హ్యాండ్ నాటెడ్, మంచాహా కలెక్షన్‌పై ప్రత్యేకమైన తగ్గింపు కలదన్నారు. మొదటిసారి జైపూర్ రగ్గుల నుంచి ప్రశంసలు పొందిన మంచాహా సేకరణ ప్రత్యేక తగ్గింపు ధరలలో అందుబాటులో ఉందన్నారు. విజయవాడలోని జైపూర్ రగ్ షోరూంలో సంప్రదించవచ్చని తెలిపారు.

జిపిఎస్‌కు వ్యతిరేకంగా పోరాటాలు : యుటిఎఫ్

ప్రజాశక్తి-మైలవరం: అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేస్తామని ఇప్పుడు జిపిఎస్ అనే కొత్త పెన్షన్ విధానాన్ని తీసుకురావడం ప్రభుత్వ ఉద్యోగులను మోసం చేయడమేనని యుటిఎఫ్ మైలవరం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీలక్ష్మి,వాడపల్లి వసంతరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న మూడున్నర లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగుల ఆకాంక్ష సిపిఎస్‌ను రద్దు చేయడమేనన్నారు. జిపిఎస్ బిల్లుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఒపిఎస్ సాధనకు పోరాటం చేపడతామని తెలిపారు.

భార్యను హత్య చేసిన భర్త

ప్రజాశక్తి-వీరులపాడు: భార్యను భర్త అతికిరాతకంగా హత్య చేసిన ఘటన జుజ్జూరు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చందర్లపాడు మండలం తొర్లపాడు గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు జుజ్జూరు విశాఖ రేకుల పరిశ్రమలో పనిచేస్తుంటాడు. భార్య నళిని జుజ్జూరులో టైలరింగ్ షాప్ నిర్వహిస్తుంది. భార్యపై అనుమానంతో భర్త గొడ్డలితో అతి దారుణంగా హత్య చేశాడు. వెంకటేశ్వరరావును పోలీసులు అదుపులో తీసుకొని కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందిగామ ఆసుపత్రికి తరలించారు.

'వలస నాయకులకు స్వస్తి పలకాలి'

ప్రజాశక్తి-మైలవరం: స్థానిక శాసనసభ్యులు వసంత కృష్ణప్రసాద్ మైలవరంకు చేసింది ఏమీ లేదని, పథకాలు చెప్పుకుంటూ కాలక్షేపం చేస్తున్నారని జనసేన పార్టీ నాయకులు పులిపాక ప్రకాష్ బాబు గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. వలస వచ్చిన నాయకులు ఇక్కడ ఉన్న సహజ వనరులను దోచుకుంటున్నారే తప్ప నియోజకవర్గ అభివద్ధి గురించి పట్టించుకోవడం లేదన్నారు. వలస నాయకులకు స్వస్తి చెప్పి స్థానికులనే గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

అవగాహన లేకనే గుండె సమస్యలు

● సెంటిని ఆసుపత్రి చీఫ్ కార్డియాలజిస్ట్ కృష్ణచంద్ ● నేడు ప్రపంచ హృదయ దినోత్సవం



ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ

కేన్సర్ కన్నా ఎక్కువ మరణాలు గుండె వ్యాధుల వల్ల కలుగుతున్నాయంటే ఎంత ప్రమాదకరమో అర్థం చేసుకోవచ్చు... మిగతా వ్యాధుల మాదిరిగా స్పష్టమైన సంకేతాలు కనబడినా... అవగాహనా లోపం వల్ల వాటిని హృదయ సంబంధ సమస్యలుగా గుర్తించడంలేదు... శుక్రవారం ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా సెంటిని ఆసుపత్రి చీఫ్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కృష్ణచంద్ కాగిత పలు విషయాలు 'ప్రజాశక్తి'కి తెలిపారు.

గుండె జబ్బు అంటే గుండె పోటు ఒక్కటే గుర్తుకొస్తుంది. గుండెపోటు అతి పెద్ద సమస్యేగానీ వాస్తవానికి గుండెకు సంబంధించి అదొక్కటే కాదు మరికొన్ని కీలక సమస్యలూ ఉన్నాయి. ఈసీజీ, టూడీ ఎకో, హోల్టర్, ఎలక్ట్రో ఫిజియాలజీ పరీక్షల ద్వారా గుండె సమస్యలను తెలుసుకోవచ్చు. గుండె వేగం తగ్గినప్పుడు ఛాతీ పైభాగంలో చర్మం కింద 'పేస్ మేకర్' అమర్చి సరిదిద్దుతారు. వీటిల్లో సింగిల్ ఛాంబర్, డబుల్ ఛాంబర్ పేస్‌మేకర్లతో పాటు అత్యాధునికమైన ట్రిపుల్ ఛాంబర్ పేస్‌మేకర్లు కూడా అందుబాటులో ఉన్నాయి. గుండె వేగం పెరిగినప్పుడు బీటా బ్లాకర్స్, గుండె లయను క్రమబద్ధీకరించే మందులు ఇస్తారు.

గుండెలయ తప్పకుండా ఉండాలంటే

పొగ తాగటం మానేయాలి.
ఒకేచోట కదలకుండా కూర్చోకూడదు
సమతులాహారం తీసుకోవాలి
కొలెస్ట్రాల్ పెరగకుండా చూసుకోవాలి
రక్తపోటును అదుపులో ఉంచుకోవాలి
బరువు పెరగకుండా చూసుకోవాలి
క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి
మధుమేహాన్ని నియంత్రణలో ఉంచుకోవాలి
తగినంత నిద్ర పోవాలి
ఒత్తిడికి దూరంగా ఉండాలి



గుండె వేగం తగ్గితే?

రక్త సరఫరా తగ్గటం వల్ల మెదడుకు తగినంత రక్తం అందదు.
శ్వాస తీసుకోవటం ఇబ్బందిగా ఉంటుంది.
అలసట, నిస్సత్తువుగా అనిపిస్తుంది.
నాడీ చాలా నెమ్మదిగా కొట్టుకుంటుంది.

గుండె వేగం పెరిగితే?

గుండె దడ వస్తుంది.
విపరీతమైన ఆయాసం వస్తుంది.
కొన్నిసార్లు గుండెలో కొద్దిపాటి నొప్పిగా కూడా ఉండొచ్చు.
తల చాలా తేలికగా ఉన్నట్టు, తిరిగినట్టు అనిపిస్తుంది.
స్పృహ తప్పటం వంటివీ జరగొచ్చు.

స్ఫూర్తిదాయకం సరస్వతీ గోరా జీవితం

జయంతిలో వక్తలు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ప్రముఖ మహిళా సంఘ సంస్కర్త సరస్వతీ గోరా జీవితం మహిళలకే కాకుండా అందరికీ స్ఫూర్తిదాయకం అని పలువురు వక్తలు అన్నారు. బెంజిసర్కిల్ వద్ద గల నాస్తిక కేంద్రంలో ప్రముఖ సంఘ సేవకులు సరస్వతీ గోరా 111వ జయంతి కార్యక్రమం గురువారం జరిగింది. ఈసందర్భంగా ఆలిండియా రేడియో స్టేషన్ విశ్రాంత ఉద్యోగి డాక్టర్ జయప్రకాష్ మాట్లాడుతూ ఛాందస భావాలు, మూఢ నమ్మకాలు, మహాత్యాల మనస్తత్వం మీద అలు పెరగని పోరాటం జరిపిన ధీర వనిత సరస్వతీ గోరా జీవితమే ఒక సందేశం, మార్గ నిర్దేశకం అన్నారు. ఆమె బాట సమసమాజ నిర్మాణానికి, మహిళాభ్యుదయానికి ఆదర్శమైన బాట అన్నారు. మూఢాచారాలు, అంధ విశ్వాసాల మీద ఆమె చేసిన పోరాటం, మహిళా సాధికారతకి జరిపిన కృషి తర తరాలకి ఆదర్శంగా నిలిచిపోతుందన్నారు. ప్రముఖ కవయిత్రి డాక్టర్ వేమూరి సత్యవతి మాట్లాడుతూ నాస్తికత్వాన్ని జీవితాచరణగా చేపట్టి ఆస్తిక జీవితం కంటే నాస్తికత్వమే ఎన్నో రెట్లు ఉత్తమమైనదని నిరూపించి చూపించారన్నారు. సాంఘిక సమానత్వం, సామాజిక న్యాయం,చ మహిళలకి పురుషులతో సమానమైన విలువ, గౌరవం ఎలా వస్తుందో, ఆచరణలో చూపించిన సాంఘిక విప్లవకారిణి సరస్వతీ గోరా అన్నారు. సామాజిక కార్యకర్త దొండపాటి లక్ష్మి పద్మజ మాట్లాడుతూ సమస్యలతో ఉన్న మహిళలకు, అభ్యుదయం కోరేవారికి సరస్వతీ గోరా జీవితం మార్గదర్శకం అన్నారు. ప్రతి ఒక్కరూ సరస్వతీ గోరా జీవితాన్ని అధ్యయనం చేయాలని, దానితో ఆలోచనా దోరణిలో , మానవ సంబంధాలలో ఎంతో మార్పు కనపడుతుందన్నారు. సరస్వతీ గోరా ఉత్తమ మహిళ, అని మహిళా లోకానికే మణిపూస అన్నారు. ఈకార్యక్రమానికి ప్రముఖ వైద్యులు డాక్టర్ సమరం అధ్యక్షత వహించగా, డాక్టర్ మారు అతిధులకు స్వాగతం పలికారు కార్యక్రమంలో రశ్మి, నియంత, శ్రీ హరి సుబ్రహ్మణ్యం, సుందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జయప్రకాష్

రోడ్డు భద్రతపై అవగాహన

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: నగరంలోని రైడర్‌లు, డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు హెూండా మోటార్ సైకిల్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్పొరేట్ వ్యవహారాల సీనియర్ డైరెక్టర్ వినయ్ తింగ్రా ఒక ప్రకటనలో తెలిపారు. రవాణా శాఖతో కలసి ఎస్‌డిఈపీ సంస్థ సంయుక్తంగా నగరంలోని వివిధ ప్రాంతాలలో ఇప్పటికే రోడ్డు భద్రతపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ముఖ్యంగా వాహనదారులకు రోడ్డు భద్రత గురించి తెలియచేయడంతో పాటు భవిష్యత్తులో ట్రాఫిక్ కారణగా ఏవిధంగా నడచుకోవాలో కూడా తెలియచేస్తున్నామని తెలిపారు. రానున్న కాలంలో వాహన దారులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడటమే తమ సంస్థ ప్రదాన ఉద్దేశమని తెలిపారు.

జాషువా సాహిత్యం అజరామరం

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రం ప్రాంగణంలో అధికార భాషా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.విజయబాబు, ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాస్, ఇతర సాహితీ ప్రముఖులు హాజరై గుఱ్ఱం జాషువా విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ జాషువా సాహిత్యం అజరామరం అని అన్నారు. జాషువా ఛీత్కారాలు ఎదురైన చోటే సత్కారాలు పొందారన్నారు. జాషువాలోని గొప్పతనం ఏమిటంటే తను ఎన్ని అవమానాలకు గురియైనా ఏనాడు దురాగ్రహం ప్రదర్శించలేదని అన్నారు. అక్షరాస్త్రాలతో ధర్మాగ్రహాన్ని ప్రదర్శించి జాషువాకు సాటి వేరెవరూ లేరని నిరూపించుకున్నారని తెలిపారు. ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ప్రభుత్వం గుఱ్ఱం జాషువా స్ఫూర్తిగా తీసుకొని ఆయన ఆశయాలకు అనుగుణంగానే పనిచేస్తుందని తెలిపారు. విద్యార్థులంతా ఆయన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, అధికార భాషా సంఘం సభ్యులు ఆచార్య గాజుల రామచంద్రా రెడ్డి , యస్.సి. కమీషన్ అధ్యక్షులు విక్టర్ ప్రసాద్ , రాష్ట్ర యస్.సి. సెల్ ప్రెసిడెంట్ బూదాల శ్రీను, పలువురు సాహితీవేత్తలు ,ఇతర దళిత నాయకులు పాల్గొన్నారు.

జయంతి వేడుకల్లో వక్తలు

నందిగామ: అణగారిన వర్గాల చైతన్యం కోసం జాషువా రచనలు అని నందిగామ ఎంఎల్‌ఎ మొండితోక జగన్ మోహన్ రావు, ఎంఎల్సి మొండితోక అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. గాంధీ సెంటర్‌లో గుర్రం జాషువా 128వ జయంతి మహోత్సవాలను స్నేహ క్లబ్ – గుర్రం జాషువా కళావేదిక – దళిత చైతన్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ నవ సమాజంలో అణగారిన వర్గాలు ఏ విధంగా చైతన్యం కావాలో తెలిపిన వ్యక్తి గుర్రం జాషువా అన్నారు. జాషువా తెలుగు పద్యాన్ని ఆయుధంగా మలుచుకుని శాస్త్రీయ, హేతుబద్ధమైన ఆలోచనలతో కులవివక్ష, అస్పృశ్యతపై యుద్ధం చేశారని తెలిపారు. సాంఘిక దురాచారాలపై గుర్రం జాషువా అలుపెరగని పోరాటం చేశారని తెలిపారు. సమాజంలోని అంతరాలను దూరం చేసేందుకు ఆయన కషి చేశారని కొనియాడారు. అనంతరం పలువురు కవులు, కళాకారులను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించారు. కాకాని నగర్‌లో మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కార్యాలయంలో గుర్రం జాషువా జయంతి వేడుకలు నిర్వహించారు. **కంచికచర్ల:** మండల పరిషత్ కార్యాలయంలో బహుజన రచయితల వేదిక కవి, రచయిత తంగిరాల సోని ఆధ్వర్యంలో నిర్వహించారు.



నందిగామలో...



కంచికచర్లలో...

అనంతరం ప్రముఖ రంగస్థల కళాకారుల కట్టా అంథోని, కర్ల రవికుమార్, తంగిరాల ప్రసాద్, నంద్రు వీరయ్య, కొలుకులపల్లి లక్ష్మీనారాయణ, వెల్లంకి భవాని శంకర్ ప్రసాద్, మెండు రఫాయాలు, అప్పిలి మురళీకృష్ణ శాస్త్రి, కడియం శివాజీరావు, చక్రాల నరసింహారావులకు జాతీయ కళాకారులు పురస్కారంతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పిల్లి స్వామిదాసు, వర్మ, బెజ్జం భూషణం, పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.



ప్రతులు దహనం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

జిపిఎస్‌ను నిరసిస్తూ జిఒ ప్రతులు దహనం

ప్రజాశక్తి-కలక్టరేట్(కృష్ణా) : ప్రభుత్వ ఉద్యోగులకు నష్టం చేసే జి పి ఎస్,విధానాన్ని నిరసిస్తూ యుటిఎఫ్ కృష్ణా జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయం వద్ద జి పి ఎస్ , జీఓ ప్రతులను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె ఎ ఉమామహేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జె.లెనిన్ బాబు, జిల్లా కార్యదర్శి టి.నాగేశ్వర రావు మరియు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి రోడ్డులో చెత్తను తరలించాలి : వంశీ

ప్రజాశక్తి-గన్నవరం : ఆగిరిపల్లి రోడ్డుకు ఇరువైపులా వేసిన చెత్తకుప్పలను వెంటనే కనసానపల్లి ఏరియాలోని క్వారీ గోతుల్లోకి తరలించాలని ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ అధికారులను ఆదేశించారు. గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో గన్నవరం పంచాయతీ కార్యదర్శి అనిల్ కుమార్, వార్డు సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ.. ప్రజలకు ఎంతో ఇబ్బందికరంగా మారిన చెత్తను వెంటనే బయటకు తరలించేందుకు టెండర్లు పిలవాలని చెప్పారు. అదేవిధంగా పట్టణంలో చీకటి అంధకారంలో రోడ్లు ఉన్నాయని వెంటనే లైట్లు కొనుగోలు చేసి వేయించాలని ఆదేశించారు. ఉర చెరువును మంచినీటి రిజర్వాయర్ గా చేయడానికి ప్రణాళికలు తయారు చేయాలన్నారు. చంద్రిక అయోధ్య భవన సముదాయానికి మంచినీటి పైప్ లైన్ ఏర్పాటు చేసే విషయాన్ని వార్డు సభ్యులతో చర్చించారు. ఇప్పుడున్న కోనయ్య చెరువు నుంచి పైపులైను వేసి నీరు ఇవ్వడం సాధ్యం కాదని కొత్తగా పోలవరం నీటితో చెరువును నింపి ఆ తర్వాత చంద్రిక అయోధ్యకు నీరు ఇవ్వడం మంచిదని కొంతమంది వార్డు సభ్యులు తెలిపారు. ఆ విధంగానే పనులు చేయించాలని వంశీ అధికారులకు సూచించారు. గన్నవరం పట్టణంలో నిర్మాణం జరిగిన ప్రతి ఇంటికి కొళాయి కనెక్షన్ ఇచ్చేలా చూడాలన్నారు. ఎంపీపీ అనగాని రవి, సర్పంచ్ నిడమర్తి సౌజన్య, మాజీ సర్పంచ్ నీలం బాలు పాల్గొన్నారు.

నిర్దేశిత లక్ష్యాల సాధనకు కృషి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : విభాగాల వారీగా జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతి రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె యస్ జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో విజయవాడ నుంచి జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, మచిలీపట్నం కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ తో కలసి పాల్గొన్నారు. రీసర్వే, జగనన్న ఆరోగ్య సురక్ష, వ్యవసాయం, జగనన్న పాలవెల్లువ, జగనన్న ఇళ్ల నిర్మాణాలు, జాతీయ రహదారులు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, స్వచ్ఛతా హీ సేవ, జగనన్నకు చెబుదాం తదితర అంశాలపై ఆయన సమీక్షించి కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. ఈ క్రమంలో జిల్లాకు సంబంధించిన పలు అంశాల పురోగతిని రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి కలెక్టర్ వివరించారు. ఈ వీడియోకాన్ఫరెన్స్ లో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ-క్రాప్ నమోదు ఇప్పటివరకు 90 శాతం పూర్తి చేశామని, గడువు తేదీ ఈ నెల 30కల్లా మిగిలిన భాగం పూర్తి చేస్తామని తెలిపారు. అదేవిధంగా పీఎం కిసాన్ ఈకేవైసి 92 శాతం పూర్తి అయ్యిందని, మిగిలిన భాగం పూర్తి చేయడంలో సమస్యలు ఉన్నట్లు చెప్పారు. సంబధిత భూ యజమానులు వేరే ప్రాంతాలకు వలసపోవడం, ఫోన్ ఓటీపీ ద్వారా సైతం ఈకేవైసి చేసుకునే వెసులుబాటు ఉన్నప్పటికీ వారి ఫోన్ నంబర్లు పని చేయకపోవడం వంటి కారణాల వల్ల నూరు శాతం పూర్తి కాలేదని తెలిపారు. కౌలు సాగు చేసుకునే రైతులకు జిల్లాలో ఇప్పటి వరకు 57,133 కౌలు కార్డులు మంజూరు చేశామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డీఆర్‌డీఏ పీడీ పిఎస్ఆర్ ప్రసాద్, సర్వే భూ రికార్డుల ఏడి టి.వెంకటేశ్వరరావు, డీఎల్ డిఓ సుబ్బారావు, మార్కెటింగ్ ఏడి నిత్యానంద, పంచాయతీరాజ్ ఎస్ ఈ విజయకుమారి, పాల్గొన్నారు.



యుటిఎఫ్ స్వర్ణోత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (ఏపీ యుటిఎఫ్) స్వర్ణోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని తోట్లవల్లూరు మండల శాఖ ఆధ్వర్యంలో గోడ పత్రికను ఆవిష్కరిం చారు. తోట్లవల్లురు మండల శాఖ నూతన కౌన్సిల్ సమావేశం గురువారం నా గళ్ళ రాజేశ్వ రమ్మ జానకి రామయ్య విజ్ఞాన కేంద్రనందు జరిగిన ఈ సమావేశంలో ఎన్నికల అధికారిగా సీతా రామయ్య, జిల్లా కమిటీ కన్వీనర్ శ్రీ ఎల్. నరేంద్ర, జిల్లా కార్యదర్శి అబ్దుల్ హబీబ్ ఆధ్వర్యంలో జరిగింది. ప్రభుత్వము ఉద్యోగ సంఘాలు వద్దని చెప్పినా వినకుండా జిపిఎస్ బిల్లును చట్టం చేసినందుకు నిరసనగా జిపిఎస్ జీవో కాపీల ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో తోట్లవల్లూరు మండలానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా విష్ణువర్ధన్, అధ్యక్షులుగా సి హెచ్. మైథిలి, సహాధ్యక్షులుగా పి పి అహ్మద్ బాబు, కోశాధికారిగా సి హెచ్ ఎల్ వి పమిడేశ్వ రరావు, ప్రధాన కార్యదర్శిగా కుమారి ఎం. విజయాద్రి ఎన్నికయ్యారు. వారితో పాటు కార్యదర్సులుగా పి. అనూష, ఏ. బాలాజీ, షేక్ రియాజ్ బాషా, ఏ నాగబాబు, ఎం. జయప్రకాష్, సిహెచ్. పార్వతి, ఏ. సునీత ఎన్నికయ్యారు. ఆడిట్ కన్వీనర్ గా శ్రీ . పి ఎన్ డి. ప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో అక్టోబర్ 1వ తేదీన కానూరు సిద్దార్థ ఇంజనీరింగ్ కాలేజీ లో జరిగే స్వర్ణోత్సవ వేడుకలకు కష్ణాజిల్లా నుంచి పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు పాల్గొన్ని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కృష్ణా జిల్లా కార్యదర్శి అబ్దుల్ హబీబ్ కోరారు.



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న దృశ్యం

యుటిఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక



ప్రజాశక్తి-తోట్లవల్లూరు : ఏపీ యుటిఎఫ్ తోట్లవల్లూరు మండల కార్యవర్గ సభ్యుల ఎన్నిక గురువారం జరిగింది. యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులుగా పొట్టి దిబ్బ లంక గ్రామ పాఠశాల ఉపాధ్యా యురాలు సిహెచ్ మైధిలి, కార్య దర్శిగా తోట్లవల్లూరు పాఠశాల ఉపాధ్యాయురాలుఎం.విజయశ్రీలను ఎన్నుకొన్నారు. ఎన్నికల అధికారులుగా టి.సీతారామయ్య, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎల్. నరేంద్ర, జిల్లా కార్యదర్శి అబ్దుల్ హబీబ్ ఎన్నికలు నిర్వహించారు. ఈ కమిటీలో గౌరవాధ్యక్షులుగా ఏ విష్ణువర్ధన్, సభాధ్యక్షులుగా పి.పి.అహ్మద్ బాబు, సహా అధ్యక్షులుగా బి.హిమ కుమారి, కమిటీ సభ్యులు సి హెచ్ ఎల్ వి పామిడి శ్వరరావు, పి. అనూష, ఏ.బాలాజీ, షేక్ రియాజ్ భాష, ఏ.నాగబాబు, ఎం. జైప్రకాష్, సి.హెచ్.పార్వతి,ఏ .సునీత, ఆడిట్ కన్వీనర్ గా పి.ఎన్. డి.ప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ స్వర్ణోత్సవాల వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. అక్టోబర్ 1వ తేదీన కానూరు సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీలో జరిగే యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలలో మండలంలోని ఉపాధ్యాయులంతా పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కార్యదర్శులకు ప్రమోషన్లు ఇవ్వాలి

ప్రజాశక్తి-ఉయ్యూరు : వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ కార్యదర్శులకు టీపీబీవో ప్రమోషన్ నేరుగా కల్పించాలని వార్డుప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ కార్యదర్శుల అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరినట్టు ఓప్రకటనలో తెలిపింది. విజయవాడలోని అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన రాష్ట్రస్థాయి విస్తత సమావేశంలో వార్డు ప్లానింగ్ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్లాలని తీర్మానించినట్టు రాష్ట్ర అధ్యక్షుడు డి.జగ్గారావు, సహాధ్యక్షుడు పి.హరీశ్ తెలిపారు. ఈవిషయమై రాష్ట్ర పట్టణ ప్రణాళిక శాఖ డైరెక్టర్ ఆర్జే విద్యుల్లతను కలసి కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలు ఆమె దష్టికి తీసుకువెళ్లినట్టు తెలిపారు. మున్సిపల్ శాఖా మంత్రి ఆదిమూలపు సురే శను కూడా కలసి టీపీబీవో ఇన్చార్జ్ బాధ్యతలు కాకుండా టీపీబీవో ప్రమోషన్ నేరుగా కల్పించాలిన కోరగా అందుకు ఆయన సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యు.రవికుమార్, నాయకులు నవీన్, నేతాజి, ఆదిల్, బాషి, కార్తీక్ తదితరులు మంత్రిని కలసిన వారిలో ఉన్నట్టు తెలిపారు.

చీరలు పంపిణీ

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి పట్టణం పరిధిలోని పడమర వీధిలోని గౌసియా పాక్ దర్గా వద్ద గురువారం ఈద్ మిలాద్ నబీ పండుగ సందర్భంగా శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్ కిషోర్ నాయుడు 35 మంది ముస్లిం మహిళలకు చీరలు బహుకరించి స్వీట్లు పంచి శుభాకాంక్షలు తెలిపారు దర్గాలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. అనంతరం నారాయణరావు నగర్ మసీదు పెద్దలు తోట శ్యామ్ కిషోర్ నాయుడును దుశ్శాలువతో దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ కరీముల్లా ఖాన్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ దిల్షాద్ నజరానా, సిపిఎం మండల పార్టీ సభ్యులు మహమ్మద్ కరీముల్లా, దర్గా ముజావర్ షేక్ కర్ణం సాహెబ్, మండల పరిషత్ కో ఆప్షన్ నెంబర్ షేక్ నబీ గౌరీ నారాయణ నగర్ మసీదు కమిటీ అధ్యక్షులు షరీఫ్ ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న శ్యాం కిషోర్‌నాయుడు

మంచినీటి చెరువు అభివృద్ధి లేనట్లేనా..

ప్రజాశక్తి- గన్నవరం : విమానాశ్రయం నుంచి కారులో రివ్వున విజయవాడ వెళ్తున్న వారికి మధ్యలో కేసరపల్లి వద్ద ఉన్న చెరువు అందంగా కనిపించాలి. దాని నుంచి వచ్చే గాలి ఆహ్లాదంగా ఉండాలి. యువకులు, వృద్ధులకు వాకింగ్ చేయడం ద్వారా ఆరోగ్యం పంచేదిగా ఉండాలి. అందుకు చెరువుతో పాటు చుట్టూ అబివృవద్ధి చేయాలి. ఈ మాటలు చెప్పింది గతముఖ్యమంత్రిగా చంద్రబాబు. ఆయన ఆదేశాలకు అనుగుణంగా చేయడానికి సిఆర్డి ఏ అధికారులు నిధులు ఇచ్చారు. కానీ ఐదేళ్లకు పనులు పూర్తి చేయాలేదు. నాంకే వాస్తీగా పనులు చేసి వదిలేశారు. దీంతో గ్రామస్తుల ఆశలు అడియాశలు అయ్యాయి. ఈ చెరువు సుందరీకరణ చేసేందుకు రూ. 4 కోట్లు నిధులు కేటాయించారు. అయితే చెరువు చుట్టూ ఉన్న ఇళ్లను బలవంతం రెవెన్యూ అధికారులు తొలగించారు. ఎమ్మెలే వంశీ గ్రామంలోకి వచ్చి నిర్వాశితులతో చర్చించి, ప్రత్యామ్నాయం చూపిస్తామని హామీ ఇచ్చారు. ఇంత వరకు నిర్వాశితులకు ఇళ్ల స్థలాలు చూపకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు.

అసంపూర్తిగా చెరువు సుందరీకరణ :

కాంట్రాక్టర్ చెరువు అభివద్ధి పనులు ఆరంభంలో వేగంగా చేయిం చారు. చెరువునిలోతు చేయడంతో పాటు చుట్టూ కట్టలు వేసి రోడ్డు పరిచారు. ఊర్లోమురుగు చెరువులోకి రాకుండా బయటకు వెళ్లేలా తూము లు ఏర్పాటు చేశారు. చెరువు చుట్టూ రోడ్డు వేసి వాకింగ్, సైక్లింగ్లకు కోసం రెండు ట్రాక్ ల నిర్మాణం చేపట్టారు. పనులన్నీ 70 శాతం పూర్తయ్యాయి. ఆతర్వాత మిగిలిన పనులు నత్తనడకన సాగాయి. నేటికీ పను లు పూర్తి చేయకుండా వదిలేశారు. ఆధునిక హంగులతో చెరువుని సుందరీకరణ చేసి, అందులో బోటింగ్ ఏర్పాటు చేస్తామని, పిల్లలు ఆడుకునేందుకు వసతులు, పెద్దలు వాకింగ్ చేయడానికి ట్రాక్ నిర్మిస్తామని చెప్పడంతో స్థానికులు చెరువు రూపురేఖలు మారిపోతాయని ఆశించారు. ఏళ్లు గడిచిపోతున్నా పనులు పూర్తి చేయలేదు. ఎందుకిలా జరిగిందో అర్థం కావడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. కొత్త ప్రభుత్వం అధికా రంలోకి రావడంతో పనులు పూర్తి చేస్తారా? ఆపేస్తారా? అనేది తెలియడం లేదంటున్నారు. సిఆర్డీఏలో ని ధులు పుష్కలంగా ఉన్నా పనులు సక్రమంగా చేయించకపోవడం పట్ల అభ్యంతరం చెబుతున్నారు. గ్రామం నడిబొడ్డున ఉన్న చెరువునిపూర్తిస్థాయిలో అభివద్ధి చేయకుండా వదిలేస్తే ఎలాగని ప్రశ్నిస్తున్నారు. నాలుగ న్న కోట్ల రూపాయల ప్రాజెక్టుని సగంలో ఆపేయడం సరి కాదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. చెరువులోతు చేయడంతో 'సుడిగుండలా మారిందని, దాంట్లో ఎవరైన పిల్లలు పడితే అంతే సంగతులని ఆందోళన చెం దుతున్నారు. 'చెరువు గట్టు ప్రక్కనే స్కూలు ఉందని, ఎప్పుడేం జరుగుతుందో తెలియదని చెబుతున్నారు. ఎ ప్పటికి వీటిని పూర్తి చేస్తారో తెలియని పరిస్థితి నెలకొందంటున్నారు.



ప్రభుత్వం స్పందించాలి : రంగారావు,

చెరువు సుందరీకరణ విషయంలో సిఆర్డీఏ అధికారులదే పూర్తి బా ధ్యత. పనులు పూర్తి చేయడంలో వారే స్పందించాలి. కాంట్రాక్టర్తో పనులు చేయించాలి. ఆరంభంలో బాగానే పనులు చేసినా తర్వాత నిదానించారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఏదేమైనా చెరువు సుందరీకరణను పూర్తి చేసి ఇవ్వాలి.

నిర్వాసితులకు ఇళ్లు ఇవ్వలేదు : రాంబాబు

ఇళ్లు కోల్పోయిన నిర్వాశితుల పరిస్థితి ఏమిటో తెలియడం లేదు. వా రికి ఐటీ పార్కు వద్ద ప్రభుత్వ భూమిలో స్థలాలు ఇస్తామని చెప్పారు. కానీ ఇంత వరకు పని జరగలేదని నిర్వాశితులు అంటున్నారు. ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి కొన్ని సమస్యలు రావడంతో ఆగిపోయినట్లుగా తెలుస్తోంది.

పెండింగ్ లేకుండా భూహక్కు పత్రాలు పంపిణీ

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ : ఎన్‌టిఆర్ జిల్లాలో రెండో దశ రీ సర్వే ప్రక్రియలో భూ హక్కు పత్రాలను పెండింగ్ లేకుండా పంపిణీ చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీ రావు తెలిపారు. జగనన్నకు చెబుదాం-1902లో నమోదవుతున్న అర్జీలను గడువులోగా పరిష్కరిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.ఎస్ జవహర్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో గురువారం తన కార్యాలయం నుండి వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకంలో భూముల రీసర్వే, భూ హక్కుల పత్రాల పంపిణీ, జగనన్నకు చెబుదాం, స్వచ్ఛతా హి సేవా తదితర అంశాలపై వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలోని కలెక్టరేట్ వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం కింద రీసర్వే ప్రక్రియను వేగంగా చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు జిల్లాలో మొదటి దశలో 14 గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ పూర్తి కాగా, ఆయా గ్రామాల్లో సరిహద్దు రాళ్ళ పాతడం, భూ హక్కు పత్రాల పంపిణీ పూర్తి చేసినట్లు చెప్పారు. అలాగే రెండో దశ కింద 15 గ్రామాల్లో నిర్వహించిన రీ సర్వేలో 12,968 సరిహద్దు రాళ్ళు పాతే లక్ష్యానికిగాను ఇప్పటికే 7 గ్రామాలలో 8,638 సరిహద్దు రాళ్లను పాతినట్లు చెప్పారు. మిగిలిన 4,330 సరిహద్దు రాళ్లను పాతే ప్రక్రియను పూర్తి చేయనున్నామన్నారు. భూహక్కు పత్రాల పంపిణీని పూర్తి చేస్తున్నామని, ఇప్పటికే 2,190 భూ హక్కు పత్రాల పంపిణీ పూర్తి చేశామని చెప్పారు. మూడో దశ రీ సర్వేలో భాగంగా జిల్లాలోని 100 గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్, వ్యాలిడేషన్ ప్రక్రియను నిర్దేశించిన విధంగా డిసెంబర్ 31వ తేదీ నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. జగనన్నకు చెబుదాం-1902 కార్యక్రమంలో భాగంగా ప్రతి బుధ, శుక్రవారాలలో మండల ప్రధాన కార్యాలయాలలో గ్రీవెన్స్ నిర్వహించి అర్జీదారుల నుండి వినతులు స్వీకరిస్తున్నామన్నారు. జిల్లాలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో 45 అర్జీలు రాగా వీటిలో 9 అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించామని, మిగిలిన 34 అర్జీలను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మే 9వ తేదీ నుండి ఇప్పటి వరకు జిల్లాలో 6,639 అర్జీలు స్పందన, తదితర మార్గాల ద్వారా వచ్చాయని, వీటిలో 5,613 అర్జీలను పరిష్కరించామని తెలిపారు. మిగిలిన వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని చెప్పారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 15వ తేదీ నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు చెత్త రహిత భారత్‌లో భాగంగా వ్యర్థాల నిర్వహణను చేపట్టామన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.డిల్లీరావు, చిత్రంలో జెసి సంపత్‌కుమార్

అక్టోబర్ 1వ తేదీన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, దీనిలో భాగంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలలు, పాఠశాలలు, అంగన్‌వాడీలు, కాలువ గట్లు, చెరువులు, జాతీయ, రాష్ట్ర, జిల్లా, గ్రామాల రహదారుల ఇరువైపులా చెత్తను తొలగించి శుభ్రపరిచే కార్యక్రమాన్ని ఎస్‌హెచ్‌జి గ్రూపులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, వాలంటీర్ల సహకారంతో నిర్వహించేలా ప్రణాళిక రూపొందించుకున్నామని కలెక్టర్ డిల్లీరావు వివరించారు. ఈవీడియోకాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ డా. పి.సంపత్ కుమార్, డ్వామా పీడీ జె. సునీత, పంచాయతీరాజ్ ఇఇ కె.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్ నాగమణిమ్మ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఎస్‌వి రమణ, ఎడి సర్వే కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.



సిపి రోడ్డుకు సైడ్‌వాల్ నిర్మించి ముంపును అరికట్టండి : సిపిఎం

ప్రజాశక్తి - విస్సన్నపేట : స్థానిక బస్టాండ్ సమీపంలో ప్రభుత్వాస్పత్రికి వెళ్లే రహదారిని సిసి రోడ్డుగా అభివృద్ధి చేశారని, అయితే ఆ ప్రాంతంలో ముంపు ప్రమాదం ఉన్న నేపథ్యంలో సైడ్‌వాల్ నిర్మించాలని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. సిసి రోడ్డు నిర్మించిన ప్రాంతాన్ని గురువారం సిపిఎం నాయకులు పరిశీలించారు. బస్టాండ్ దగ్గర ఉన్న చెరువు వరద చింతకుంట ప్రాంతంపై ప్రభావం చూపుతుందని, గతంలో కూడా వరదల వల్ల అక్కడున్న ఇళ్లు ముంపునకు గురయ్యాయని గుర్తుచేశారు. అందువల్ల ఇళ్లు ముంపునకు గురికాకుండా సైడ్‌వాల్ ఎత్తు పెంచి డ్రైనేజీ వ్యవస్థ ప్రతిష్ఠంగా ఏర్పాటు చేయాలని కోరారు. సిసి రోడ్డు పక్కన గ్రావెల్ వేయాలని, ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు ఇబ్బంది లేకుండా రోడ్డు వెడల్పు పెంచాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట కళ్యాణ్, విస్సన్నపేట మండల కార్యదర్శి నాగరాజు, మండల నాయకులు మేకల జ్ఞానరత్నం, పులిబల్ల ఏడుకొండలు, గద్దల రామకృష్ణ పాల్గొన్నారు.

కాల్వల శుభ్రతకు చర్యలు : విఎంసి కమిషనర్ దినకర్

ప్రజాశక్తి - విజయవాడ : నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆధ్వర్యంలో ఇండియన్ స్వచ్ఛత 2.0, స్వచ్ఛతాహి సేవాలో భాగంగా స్వాతంత్ర సమరయోధుల భవనం సమీపంలోని బందరు లాకుల వద్ద పేరుకుపోయిన చెత్తను గురువారం పారిశుధ్య సిబ్బంది తొలగించారు. 300 మందికిపైగా స్వచ్ఛ వారియర్స్, నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికులతో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛత హి సేవ అంటూ నినాదంతో కాల్వగట్లను ఎంతో సుందరంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాల్వగట్ల సుందరీకరణ చేపట్టినట్లు తెలిపారు. కాల్వల పక్కన చెత్త వ్యర్థాలను వేయకుండా జల కాలుష్యాన్ని తగ్గించి, ప్రజా జీవితాలకు హాని లేకుండా చేయాలన్నారు. కాల్వల్లో చెత్త, భవనాల వ్యర్థాలను వేయొద్దన్నారు. నగరంలో ఉన్న మూడు కాల్వలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా.పి.రత్నావళి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు నారాయణ మూర్తి, హెల్త్ ఆఫీసర్లు, బయాలజిస్ట్ సూర్య నాయక్, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

నేడు నగరంలో సిఎం సభ

చేశారు. డాగ్ స్క్వాడ్‌తో సభాస్థలిని అణువణువునా తనిఖీ నిర్వహించారు. ఇప్పటికే పోలీస్ కమిషనర్ కాంతిరాణా టాటా ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు. ముఖ్యమంత్రి జగన్ ఉదయం 10.30 గంటలకు సభాస్థలికి చేరుకుంటారు. అనంతరం వాహనమిత్ర పథకం లబ్ధిదారులకు ఐదో విడత నిధులు విడుదల చేస్తారు. ఏర్పాట్ల పరిశీలనలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు నారాయణ మూర్తి, హెల్త్ ఆఫీసర్లు, శానిటరీ ఇన్స్ పెక్టర్లు పాల్గొన్నారు.

సమసమాజం కోసం శ్రమించిన జాషువా

కొనియాడారు. అందుకనే ధన్యజీవి అయ్యారన్నారు. సంరక్ష సొసైటీ జనరల్ సెక్రటరీ, జాషువా మనవడు డాక్టర్ బి.ఆర్.సుశీల్ కుమార్ మాట్లాడుతూ ప్రతి కవికి ఒక విజన్ ఉంటుందన్నారు. జాషువాకు ఉన్న విజన్ కులాలు, మతాలు లేని సమ సమాజస్థాపన అన్నారు. ఇందుకోసం ఆయన కలలు కన్నారని గుర్తుచేశారు. దానికోసం ఊహించారని, దాన్నే ప్రజలకు తెలియజేయడానికి కవితలను ఆధారంగా చేసుకున్నారని అన్నారు. మానవత్వమే మతంగా, సమానత్వమే కులంగా భావించిన వ్యక్తి జాషువా అని కొనియాడారు. ఈ సభలో జాషువా సాంస్కృతిక వేదిక అధ్యక్షులు సునీల్‌కుమార్, గుండు నారాయణ తదితరులు పాల్గొన్నారు అనంతరం నాటిక పోటీల్లో విజేతలకు బహుమతీ ప్రదానం జరిగింది.

సామాజిక చైతన్య ఉద్యమకారుడు జాషువా

జయంతిలో కలెక్టర్ డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ : మహాకవి గుర్రం జాషువా గొప్ప సామాజిక చైతన్య ఉద్యమకారునిగా చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తారని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీ రావు అన్నారు. ప్రముఖ రచయిత, కవి, సాహితీకారుడు, నవయుగ చక్రవర్తి గుర్రం జాషువా 128వ జయంతిని పురస్కరించుకొని కలెక్టర్ డిల్లీ రావు గురువారం స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద ఆయన కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం పిరదౌసి, గబ్బిలం వంటి ప్రసిద్ధి చెందిన రచనలతో ప్రజల ఆలోచనలలో మార్పు తీసుకువచ్చారని అన్నారు. మహాకవి గుర్రం జాషువా జయంతిని ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించాలని ఉత్తర్వులు వెలువడ్డాయన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ప్రజలంతా ఐకమత్యంతో మెలగాలని ఆకాంక్షించారు. 1895 సెప్టెంబర్ 28న గుంటూరు జిల్లా (ప్రస్తుతం పల్నాడు జిల్లా) వినుకొండ మండలం చాత్రగడ్డపాడులో గుఱ్ఱం వీరయ్య, లింగమ్మ దంపతులకు జన్మించారన్నారు. చిన్నతనం నుంచి జాషువాలో సజనాత్మక శక్తి ఉండేదని, బొమ్మలు గీయడం, పాటలు పాడడం చేసేవాడిని, ఆయన 36 గ్రంథాలు, మరెన్నో కవితా ఖండికలు రాశారని గుర్తుచేశారు. రుక్మిణీ కళ్యాణం, కోకిల, ధ్రువ విజయం, గబ్బిలం, ఫిరదౌసి,



ఖండకావ్యాలు తదితర అనేక రచనలు చేశారని తెలిపారు. కవితా విశారద, కవి కోకిల, నవయుగ చక్రవర్తి, విశ్వకవి సామ్రాట్‌గా బిరుదులు పొంది ప్రసిద్ధి చెందారని అన్నారు. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో యుద్ధ ప్రచారకుడిగా పని చేశారన్నారు. తెలుగు రాష్ట్రంలో జన్మించిన అతి గొప్ప వ్యక్తుల్లో గుర్రం జాషువా ఒకరని, కడు పేద కుటుంబం నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగి గుర్తింపు పొందిన మహనీయుల్లో జాషువా ఒకరని అన్నారు. ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ కోరారు.

1న వద్ధుల దినోత్సవ సభ

ప్రజాశక్తి - విజయవాడ : సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, వద్ధులు, విభిన్న ప్రతిభా వంతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యాన అక్టోబర్ 1వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రపంచ వద్ధుల దినోత్సవ సభ జరుగుతుందని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు తెలిపారు. నగరంలోని స్వాతంత్ర్య సమరయోధుల సంఘం భవనంలో జరిగే ఈ సభలో కలెక్టర్, పోలీసు కమిషనర్, ఎమ్మెల్యేలు పలువురు ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు.

పోరాట యోధుడు భగత్‌సింగ్ : కలెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ : దేశ స్వాతంత్ర కోసం అలుపెరగని పోరాటం చేసిన యోధుడు భగత్‌సింగ్ అని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీ రావు అన్నారు. నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్రిటీష్ పాలన నుండి దేశ విముక్తికి ప్రాణాలను తణప్రాయంగా ఎంచి ఉరికంబం ఎక్కాడని, ఆయన త్యాగనిరతి మరువలేనిదని అన్నారు. 23 ఏళ్ల చిరుప్రాయంలోనే భగత్‌సింగ్‌కు ఉన్న అవగాహన అందరినీ ఆశ్చర్య పరుస్తుందన్నారు. రాజకీయ ఖైదీలకు సమాన హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ జైలులో 64 రోజులు నిరాహార దీక్షను చేపట్టడం ద్వారా భగత్‌సింగ్ అందరి మద్దతును కూడగట్టుకున్నారన్నారు. నాటి స్వాతంత్ర సంగ్రామంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా యువతను చైతన్యవంతులను చేసేందుకు సామ్యవాద సిద్ధాంతాన్ని అనుసరించారని గుర్తుచేశారు.



16వ రోజుకు రిలే దీక్షలు



గుడివాడలో...



హనుమాన్‌జంక్షన్‌లో...



పమిడిముక్కలలో...

ప్రజాశక్తి-గుడివాడ : మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరావు అధ్వర్యంలో కోనసాగుతున్న రిలే నిరహారదీక్షలు గురువారం 16వ రోజులకు చేరాయి. స్థానిక టిడిపి కార్యాలయంలో నారా చంద్రబాబు అక్రమ అరెస్ట్ నిరసనగా నందివాడ మండల అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు అధ్వర్యంలో 16వ రోజు రిలే నిరహారదీక్షలు చేస్తున్న నాయకులకు పట్టణా, రూరల్ మండలల అధ్యక్షులు దింట్యాల రాంబాబు, వాసే మురళీలు పూలమాలలు వేసి దీక్షలు ప్రారంభించారు. తెలుగు యువత అధ్యక్షులు గోవాడ శివా, నాయకులు కాకరాల సురేష్, షయ్యద్ జబీన్, సింగవరపు ప్రభాకరరావు, యార్లగడ్డ సుధారాణి, కంచర్ల సుధాకర్, చాట్రగడ్డ రవికుమార్ ,పిల్లా సాల్మన్, మద్దాలి ఇస్సాక్ ,ఉప్పల వెంకటేశ్వరరావు, తాతనేని మురళీకష్ణ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ :** మాజీ ఉప సభాపతి మండలి బుద్ధ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే దీక్షలు 16వ రోజుకు చేరుకున్నాయి. గురువారం దీక్షలో దివిసీమ రంగస్థలం కళాకారులు దీక్షలో పాల్గొన్నారు. దీక్షలను బుద్ధ ప్రసాద్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలదండలు వేసి దీక్షలను ప్రారంభించారు. అనంతరం భద్ర ప్రసాద్ దీక్షలో పాల్గొన్న వారికి నిమ్మరసం ఇచ్చి దీక్షలను నిర్మింప చేశారు. ఈ దీక్షలో కళాకారులు పుప్పాల వీరాంజ నేయులు, దిరిశం బాలకోటయ్య, నారే పాలెం వేణు, కోమటి శ్రీనివాసరావు, లంకె వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఘంటసాల :** ప్రభుత్వం కక్షపూరితంగా మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని అరెస్టు చేసిందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్ అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా గురువారం రాత్రి మండల పరిధిలోని మల్లాయి చిట్టూరు గ్రామంలో టీడీపీ, జనసేన పార్టీల నేతలు సంయుక్తంగా కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు తుమ్మల చౌదరిబాబు, టీడీపీ నేతలు పరుచూరి సుభాష్ చంద్రబోస్, తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), అయినపూడి భాను ప్రకాష్, బండి పరాత్పరరావు, పరిశ చలపతి, తుమ్మల నందేశ్వరరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ :** బాబు అక్రమ అరెస్టు, రిమాండ్ ను నిరసిస్తూ కష్ణా జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి, బోడె ప్రసాద్ పోరంకిలో తన నివాసంలో గురువారం ఉదయం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షకు మద్దతుగా తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మూల్పూరి సాయి కల్యాణి పాల్గొని సంఘీభావం తెలిపారు. దీక్షకు తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కోనేరు నానితో పాటుగా ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి పెద్దఎత్తున టీడీపీ శ్రేణులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని సంఘీభావం తెలిపారు. అలాగే బాపులపాడు మండలం బండారు గూడెం గ్రామంలో గ్రామ పార్టీ అధ్యక్షులు కొండేటి నాగరాజు ఆధ్వర్యంలో గురువారం రాత్రి కాగడాలతో వీధుల్లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి, సాయి కళ్యాణి, రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహ కార్యదర్శి చిరుమామిళ్ల సూర్య నారాయణ ప్రసాద్, రాష్ట్ర సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షులు ఆళ్ల వెంకట గోపాలకష్ణ రావు, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుండపనేని ఉమావరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు .**ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా గురువారం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. గుడివాడ టిడిపి పార్టీ ఇంచార్జ్ రావి వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో స్థానిక ప్రధాన రహదారిలోని ఎన్టీఆర్ విగ్రహం నుండి తెలుగుదేశం శ్రేణులు కొవ్వొత్తులు చేపట్టి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయ కులు, కార్యకర్తలు మహిళలు అధికంగా పాల్గొన్నారు. **ప్రజాశక్తి-తోట్లవల్లూరు :** పామర్రు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి వర్ల కుమార్ రాజా ఆధ్వర్యంలో గురువారం జలదీక్ష నిర్వహించారు. ఈ జలదీక్షలో తెలుగుదేశం పార్టీ బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి, భీమవరపు అంజిరెడ్డి, నక్కలపూడి మురళి,నర్రా వెంకట అప్పారావు, మోటూరి వెంకట సుబ్బయ్య, జంపన శ్రీనివాసరావు, గోలి వసంత కుమార్, చింతపల్లి వెంకటేశ్వర రావు, తోట్లవల్లూరు గ్రామ పార్టీ అధ్యక్ష కార్యదర్శులు గొరిపర్తి గోపయ్య, వల్లూరు రాంబాబు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల:** చంద్రబాబు అరెస్టుకు నిరసనగా పమిడి ముక్కల మండలంలోని కపిలేశ్వరపురం గ్రామంలో నిరసన జరిగింది. ఈ కార్యక్రమంలో పామర్రు తెలుగు దేశం పార్టీ ఇంచార్జ్ కుమార్ రాజా, తాతినేని రామబ్రహ్మం, కొడాలి కోటేశ్వరరావు, మాజీ ఎంపీపీ మోటూరి వెంకట సుబ్బయ్య, మాజీ వైస్ ఎంపీపీ లింగమనేని రామారావు, మైనేని నరేంద్ర, నాదెండ్ల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈద్ మీలాద్ ఉన్ నబి

ప్రజాశక్తి-గుడివాడ : ముస్లిం సోదరులకు పవిత్రమైన మిలాద్ ఉన్ నబి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని మియాఖాన్ (పెద్ద మజీద్) కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మజీద్ కమిటీ అధ్యక్షుడు ఎండి వలి, వైసిపి మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ బాజీ, మత గురువులు మహమ్మద్ అక్బర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** మహమ్మద్ ప్రవక్త బోధనలు ప్రతి ముస్లిం ఆచరించాలని ఖురాన్ గురువులు బోధించారు. గురువారం చల్లపల్లిలో మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ముస్లిం సోదరులు మస్జీదులో ప్రత్యేక ప్రార్ధనలు చేసి ఇస్లాం పతాకంతో పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. **ప్రజాశక్తి ఉయ్యూరు :** సర్వ మానవాళి శాంతికోసం పరితపించిన గొప్ప వ్యక్తి మహ్మద్ ప్రవక్త జన్మదిన మిలాద్ ఉన్ నబీ వేడుక గురువారం ఉయ్యూరులో ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈసందర్భంగా మసీదుల్లో ప్రత్యేక నమాజు చేసి అన్న సమారాధన చేశారు. దయా రా మసీదులో జరిగిన కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైరన్ అబుకలాం, నగరపంచాయతీ కో-ఆప్షన్ సభ్యుడు ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీరామ్ కుటుంబసభ్యులకు చిత్రపటం అందిస్తున్న ఈవో

దుర్గమ్మను దర్శించుకున్న అడ్వకేట్ జనరల్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మను గురువారం రాష్ట్ర అడ్వకేట్ జనరల్ సుబ్రహ్మణ్యం శ్రీరామ్ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ అమ్మవారి దర్శనార్థం ఆలయానికి విచ్చేశారు. ఆలయ కార్యనిర్వ హణాధికారి దర్భముళ్ల భ్రమరాంబ వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, శ్రీఅమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వీరికి వేదపండితులు వేదా శీర్వచనం చేయగా ఆలయ కార్య నిర్వహణా ధికారి శ్రీ అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పరీక్షలు

ప్రజాశక్తి-నందిగామ : నందిగామ శివారు అనాసాగరం పీహెచ్సీ ఆధ్వర్యంలో గురువారం ఆశా వర్కర్స్ ఇంటింటికి తిరిగి జగనన్న ఆరోగ్య సురక్ష పరీక్షలు నిర్వహించారు. ఇంటింటికి జరుగుతున్న సర్వేలో భాగంగా గురువారం ఒకటవ సచివాలయము పరిధిలోని ఏఎన్ఎం జయసిల ఆశ వర్కర్ల బందం ఒకటో వార్డులో పర్యటించారు. వైద్య నిమిత్తం అవసరమైన అభ్యర్థులు వచ్చే నెల అక్టోబర్ 5వ తారీఖు అనాసాగరం యూపీహెచ్సి ఆధ్వర్యంలో జరగబోయే మెగా ఆరోగ్య క్యాంపును సద్వినియోగము చేసుకోవాలని కోరారు. కుటుంబానికి సంపూర్ణ ఆరోగ్య సంరక్షణ అందించేందుకు జగనన్న ఆరోగ్య రక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 20వ వార్డ్ వైసీపీ ఇన్ చార్జ కర్రి రవీంద్ర పలువురు ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.



నాగేంద్రనాథ్ మృతికి సంతాపం

ప్రజాశక్తి-అవనిగడ్డ : రైతు సంఘం నాయకుడు ఎర్నేని నాగేంద్రనాథ్ ఆకస్మిక మరణం పట్ల మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అంకితభావం గల రైతు నాయకుడిని కోల్పోయామని కష్ణ డెల్టా ఉద్యమంలో తమకు మార్గదర్శకుడుగా వ్యవహరించి నడిపించారు అన్నారు. వ్యక్తిగతంగా ఒక ఆత్మీయుడిని కోల్పోయామని వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు బుద్ధ ప్రసాద్ తెలిపారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** రైతాంగం కోసం అహర్నిశలు పోరాడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతాంగ సమాఖ్య అధ్యక్షులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ డ్రైనేజ్ బోర్డు సభ్యులు, ఎర్నేని నాగేంద్రనాథ్ అకాల మరణం పట్ల గుడ్లవల్లేరు మండలం రైతాంగం ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన రైతులతో మమేకమై, రైతుల భాదలను ప్రభుత్వం వద్దకు తీసుకువెళ్లి రాష్ట్రంలో ఉన్న అన్ని మురుగు కాలవలు, పంట కాలవలు పూర్తిగా అవగాహన గల వ్యక్తిగా, రాజకీయాలకు అతీతంగా, అజాతశత్రువుగా నిలచిపోయే ఎర్నేని నాగేంద్రనాథ్ మరణం రైతాంగానికి తీరనిలోటని జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు పెన్నేరు ప్రభాకరరావు అన్నారు. అకాల మరణానికి చింతిస్తూ ,వారి ఆత్మకు శాంతి కలగాలని కోరారు.

29న మహాధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-వత్సవాయి : దళితుల రక్షణ యాత్ర మహాధర్నా సెప్టెంబర్ 29న విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కెవిపిఎస్ వ్యవసాయ కార్మిక సంఘం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి నటరాజ్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం నీరు కారుస్తున్న 41 సి ఆర్ పి సి కింద ఇస్తున్న బెయిల్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేసులను త్వరగతిగా విచారించేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయా లన్నారు. కులవివక్షత అంటరానితనం నిర్మూలనపై ప్రభుత్వమే డప్పు కళాకారుల ద్వారా ప్రచార నిర్వహించాలని డిమాండ్ చేశారు. టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతి దళిత కుటుంబానికి రెండు ఎకరాలు భూమి. మూడు సెంట్లు ఇళ్ల స్థలం ఇవ్వాలని కోరారు దళితులకు నష్టపరిచే అసైన్మెంట్ చట్టం ఆర్డినెన్స్ రద్దు చేయాలని 9/77 సెయింట్ మెంట్ చట్టం కొనసాగించాలని అన్నారు. ఈ ధర్నాకు పెద్ద ఎత్తున కార్యకర్తలు రావాలని కోరారు.

కంచికచర్లలో భారీ వర్షం

ప్రజాశక్తి-కంచికచర్ల: కంచికచర్ల మండలంలో గురువారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. కొన్ని రోజులుగా వర్షం లేక పోవటంతో ప్రతి, మిర్చి, మొక్కజొన్న, వరి పంటలు బెట్టకు వచ్చాయి. దీనికి తోడు వాతావరణం లో మార్పులు వల్ల పగలు, రాత్రి తేడా లేకుండా తీవ్ర ఉక్కపోతకు జనం అల్లాడిపోయారు. ఈ తరుణంలో గురువారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురవటంతో రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. భారీ వర్షానికి జుజ్జూరు రోడ్డుపై నాలుగు అడుగుల మేర నీరు ప్రవహించి, చెరువును తలపించింది. బస్టాండ్ ఆవరణలో నీరు నిలబడి ప్రయాణికులు రాకపోకలు ఇబ్బందులు పడ్డారు. డ్రైనేజీ పొంగి రోడ్డుపై చేరింది.

టిడ్కో ఇళ్లు కేటాయించకపోవడం దుర్మార్గం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : గత ప్రభుత్వ హయంలో పేదలు రూ. 25 వేలు నుంచి లక్ష వరకూ అప్పులు తెచ్చి టిడ్కో ఇళ్ళకు డబ్బులు కట్టారని, వైసిపి ప్రభుత్వం ముఖ్యమంత్రి వైస్ జగన్ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల అయినా నేటికి ఇళ్లు కేటాయించకపోవటం విచారకమని 44వ డివిజన్ జనసేన అధ్యక్షురాలు మల్లెపు విజయ లక్ష్మి ఘాటుగా విమర్శించారు. వాహన మిత్ర పథకాన్ని అందించ డానికి ఈ నెల 29 వస్తున్న సీఎం జగన్‌కు పశ్చిమ నియోజక వర్గంనకు వచ్చే అర్హత లేదని జనసేన పార్టీ 44వ డివిజన్ అధ్యక్షురాలు మల్లెపు విజయలక్ష్మి ఘాటుగా విమర్శించారు. గురువారం జగన్ రాకను వ్యతిరేకిస్తూ పార్టీ సభ్యులతో కలిసి ఆమె నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ జగన్ పశ్చిమ నియోజకవర్గం అభివద్ధికి చేసిందేమీ లేదని విమర్శించారు. ఈ నియోజకవర్గానికి నిధులు ఎంత కేటా యించారనీ ప్రశ్నించారు. ప్రజలకు టిట్కో ఇళ్ళు ఇస్తాని, జగనన్న కాలనీలో ఇళ్ళు ఇస్తామని ప్రజలను మోసం చేవారని తెలిపారు.

ఎంఎస్ స్వామినాథన్ మృతికి సంతాపం

ప్రజాశక్తి-అవనిగడ్డ : భారత హరిత విప్లవ యోధుడు ప్రొఫెసర్ ఎంఎస్ స్వామినాథన్ మృతి భారతదేశ ప్రజలకే కాకుండా ప్రపంచంలోనే రైతులు అనుబంధ రంగాల శ్రామికులకు తీరని లోటు అని బీసీ నాయకులు ఆంధ్రప్రదేశ్ సంప్ర దాయ మత్స్యకారుల సేవ సంఘం ప్రధాన కార్యదర్శి లక్కనం నాగాంజనేయులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. గురువారం అవనిగడ్డ లోని మత్స్యకారులు భవనం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 2008లో విడుదల చేసిన సముద్ర తీర ప్రాంతపు వాస్తవం నిర్వహణ నోటిఫికేషన్ సమీక్షించడానికి కేంద్ర ప్రభుత్వం 16 జూలై 2009న ప్రొఫెసర్ ఎంఎస్ స్వామినాథన్ అధ్యక్షతన నిపుణుల కమిటీ నియమించింది అన్నారు. ఈ కమిటీ సముద్రతీర ప్రాంతంలో నివసించే మత్స్యకారుల వత్తికి ఉపాధికి నివసించడానికి ఆటంకం కలగకుండా అప్పటి కేంద్ర ప్రభుత్వంకు పలు సిఫారసులు చేసిందన్నారు. ఎం ఎస్ స్వామినాథన్ మతికి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నట్లు నాగాంజనేయులు తెలిపారు. **ప్రజాశక్తి-గుడివాడ :** ఎంఎస్ స్వామినాథన్ మృతి చెందడం బాధాకరమని నుగాలాపు జయలక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, శ్రీ శ్రీనివాస అటో ఇంజనీరింగ్ వర్క్స్ అధినేత మాజీ మున్సిపల్ చైర్మన్ నుగలాపు వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఆహార వద్ధిలో భారత్ స్వయం సమద్ధి సాధించేందుకు విశేష కషి చేశారన్నారు. అనతరం అయన చిత్రపటానికి నివాళ్ళు అర్పించారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు :** ప్రపంచ ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త, రామన్ మెగాసెసే అవార్డు గ్రహీత, పద్మవిభూషణ్ ఎం.ఎస్.స్వామినాథన్ మరణం పట్ల నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం నేషనల్ వైస్ చైర్మన్ జమీల్ అహ్మద్ బేగ్ సంతాపం వ్యక్తం చేశారు. స్వామినాథన్ మరణంతో దేశ వ్యవసాయ రంగం పెద్ద దిక్కును కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

దుర్గమ్మను దర్శించుకున్న హోం మంత్రి

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఇంద్రకీలాద్రి దుర్గమ్మను రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత గురువారం దర్శించుకున్నారు. ఆలయ



ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, కార్యనిర్వహణాధికారి దర్భముళ్ల భ్రమరాంబ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, అమ్మవారి దర్శనం కల్పించారు. హోం మంత్రితో పాటుగా నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

సూపర్ స్పెషాలిటీ హామీ ఏమైంది? : గంగాధర్

ప్రజాశక్తి-వన్‌టౌన్: పశ్చిమ నియోజకవర్గంలోని షేక్ రాజా ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అభివృద్ధి



చేస్తామన్న హామీ ఏమైందని జనసేన పార్టీ 50వ డివిజన్ అధ్యక్షులు రెడ్డిపల్లి గంగాధర్ ప్రశ్నించారు. గురువారం 50వ డివిజనులో గొల్లపాలెం గట్టు సాయిబాబా మందిరం వద్ద ఉన్న ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ షేక్ రాజా ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అదనపు సిబ్బందిని నియమించాలని గంగాధర్ డిమాండ్ చేశారు. కొండప్రాంత ప్రజలకు ఇళ్ల పట్టాలు గాని, పేదలకు టిట్కో ఇళ్లుగాని ఇవ్వలేదన్నారు. ఇక్కడి స్థానిక వైసీపీ నాయకులు, ఎమ్మెల్యే వెలంపల్లి ప్రజల సమస్యలు పట్టించుకోవటం లేదన్నారు. ఈ సమావేశంలో సాబింకర నరేష్ ఆర్య కటిక, పిళ్ల రవి, మద్దెల కనకారావు, రెడ్డిపల్లి అనిత తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి చికిత్సకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-వన్‌టౌన్: కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న నాలుగు నెలల బాబు సింగినగర్ స్మైల్ హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్నాడు. శస్త్ర చికిత్స



చేయవలసి రావటంతో తల్లిదండ్రులు దీవెన ఫౌండేషన్ వారిని ఆశ్రయించారు. దీంతో గురువారం దీవెన ఫౌండేషన్ విజయవాడ పోలీస్ వారి తరపున రూ.10 వేలు ఆర్థిక సహాయం గ్రూప్ సభ్యులు నున్న హెడ్ కానిస్టేబుల్ పుల్లారావు, సింగినగర్ కానిస్టేబుల్ సురేష్, ట్రాఫిక్ కానిస్టేబుల్ బ్రహ్మం హాస్పిటల్‌కి వెళ్లి సహాయం అందజేశారు.

సిఎం రాకను వ్యతిరేకిస్తూ నిరసన

ప్రజాశక్తి-భవానీపురం: పశ్చిమ నియోజకవర్గానికి పైసా నిధులు ఇవ్వని సీఎం జగన్ గో బ్యాక్ అంటూ గురువారం కోమల విలాస్ సెంటర్ వద్ద ముస్లింలతో కలసి జనసేన పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జి పోతిన వెంకట మహేష్ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గ అభివద్ధిని గాలికి వదిలేసిన జగన్మోహన్ రెడ్డికి ఇక్కడ అడుగుపెట్టే అర్హత లేదన్నారు. జగన్ పాలనలో ఆటో డ్రైవర్ల మీద ట్రాఫిక్ పోలీసులతో పాటు లా అండ్ ఆర్డర్ పోలీసులు వేధింపులు ఎక్కువయ్యాయని, ట్రాఫిక్ చలనా గతంలో 135 రూపాయలు వుండేదని కానీ వైసిపి అధికారంలోకి వచ్చాక పది రెట్లు పెరిగి 1350 రూపాయలు అయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన 40 డివిజన్ అధ్యక్షురాలు షేక్ షర్మిల, నగర ప్రధాన కార్యదర్శి ముబీనా పాల్గొన్నారు.



యువతకు స్ఫూర్తి భగత్‌సింగ్

విజయవాడ: భగత్ సింగ్ స్ఫూర్తితో విద్య, ఉపాధి అవకాశాల కోసం యువత పోరాడాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న పిలుపునిచ్చారు. డివైఎఫ్ఐ విజయవాడ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో, 60వ డివిజన్ వాంబేకాలనీలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ స్వేచ్ఛ కోసం, సమానత్వం కోసం, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు భగత్‌సింగ్ అని కొనియాడారు. అసమానతలు పోవాలంటే సోషలిజమే మార్గమని నమ్మి దాని కోసం యువత పోరాడాలని ఆ రోజే కోరారన్నారు. నేడు దేశాన్ని పట్టి పీడుస్తున్న నిరుద్యోగం, ధరలు, పేదరికం, నిరక్షరాస్యత, ఆకలి చావులు, రైతు ఆత్మహత్యలు, మహిళలపై అఘాయిత్యాలు, దళితులపై దాడులు అంతరించినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం అని అదే భగత్ సింగ్‌కు అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. అవినీతి రహిత సమాజం, అసమానతలు లేని సమాజం, దోపిడీ లేని సమాజం కోసం యువత ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మోధీ అధికారంలోకి వచ్చాక దేశ సంపదను లూటీ చేసి అదానీకి, అంబానీకి అమెరికా సామ్రాజ్యవాదులకు దోచిపెడుతుందని అన్నారు. ఆరోజు బ్రిటిష్ సామ్రాజ్యవాదులతో కలిసి దేశానికి ద్రోహం చేసిన ఆర్‌ఎస్‌ఎస్ నేడు దేశభక్తి పేరుతో కొత్త డ్రామాలు ఆడుతు చరిత్రను వక్రీకరిస్తూ కోత్త భాష్యం చేబుతుందని అన్నారు. అందుకే నేటి యువతరానికి భగత్ సింగ్ చరిత్ర తెలియనియకుండా పాఠ్యాంశాలు మార్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డివైఎఫ్ఐ మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి భగత్ సింగ్ జయంతిని అధికార కార్యక్రమంగా జరపాలని, భగత్ సింగ్ విగ్రహాలు ఏర్పాటు చేయాలని, పాఠ్య పుస్తకాలలో భగత్ సింగ్ చరిత్ర చేర్చాలని డిమాండ్ చేశారు. స్వాతంత్రం వచ్చి 76 సంవత్సరాలు అయినప్పటికీ యువత ఉద్యోగాలు లేక సరైన ఉపాధి దోరకాక రోడ్డున పడుతున్నారని మేము అధికారంలోకి వస్తే అధికారంలోకి వస్తే సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్నా బిజెపి నేడు మాట తప్పడం ఎమిటి అని ప్రశ్నించారు. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్

జయంతి వేడుకల్లో వక్తలు

విడుదల చేస్తానన్న వైయస్ జగన్మోహన్ రెడ్డి యువత పట్ల చూపిస్తున్న వైఖరిని తిప్పి కొట్టాలని యువతకు పిలుపునిచ్చారు. అలాగే దేశంలో నిరంతరం మహిళలపై జరుగుతున్న దాడులను ఖండించాలని మతోన్మాద రాజకీయ విధ్వంసాలను అరికట్టి భవిష్యత్తును కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ సెంట్రల్ సిటీ అధ్యక్ష కార్యదర్శులు వివ, నిజంముద్దిన్, నాయకులు పీరు, దుర్గాప్రసాద్, యశ్వంత్, రవి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మైలవరం: స్థానిక బాలికల హాస్టల్స్‌లో భగత్‌సింగ్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ సుధాకర్, మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎం చరణ్, ఏ అజయ్, ఉపాధ్యక్షులు కుమార్, దీవెన, ప్రమీల, పూజిత, మహిమ తదితరులు పాల్గొన్నారు.

నందిగామ: ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సంక్షేమ బాలికల వసతి గృహంలో బాలుర సంక్షేమ హాస్టల్లో భగత్‌సింగ్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గోపినాయక్, గర్ల్స్ కన్వీనర్ షేక్ జాహిదా, నాయకులు షేక్ ఖాజ, వెంకటేష్ పాల్గొన్నారు.


తిరువూరు: తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సిపిఎం నాయకులు, కార్యకర్తలు భగత్‌సింగ్, గుర్రం జాషువా చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ఎం.నాగేంద్రప్రసాద్, మండల కార్యదర్శి సాంబారు వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు గుళ్ళపల్లి వెంకటరత్నం, నాయకులు పంతంగి శ్రీనివాసరావు, బి.వెంకటేశ్వరరావు, ఆకుల రవి, కడిమి పాపారావు, నాగులమీరా, పాకాల రామకష్ణ, ఎం.నరసింహారావు, కె.వి.రత్నం, చప్పిడి సురేష్, జెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** పట్టణంలోని ఎస్సీ ఇంటిగ్రేడ్ హాస్టల్లో జరిగిన కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా సహాయ కార్యదర్శి రాజు, వై కమల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సింగ్‌నగర్‌లో...



జగ్గయ్యపేటలో...



మైలవరంలో...



నందిగామలో...




తిరువూరులో...

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబి

ప్రజాశక్తి-కంచికచర్ల: మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజు అయిన ఈద్ ఈ మిలాద్-ఉన్-నబి వేడుకలు గురువారం కంచికచర్లలో ఘనంగా నిర్వహించారు. జామియా మస్జిద్ నుండి పురవీధుల్లో ముస్లింలు ర్యాలీని నిర్వహించారు. ర్యాలీలో కంచికచర్ల మసీద్ గురువు గులాం గౌస్, ట్రెజరర్ షేక్ రజీమ్, ప్రెసిడెంట్ సత్తార్, వైస్ ప్రెసిడెంట్ సైదా, కన్వీనర్ బాజీ ఖాన్, సెక్రటరీ నూరుద్దీన్ కమిటీ సభ్యులు షేక్ నాగుల్ మీరా తదితరులు పాల్గొన్నారు. వసంత కాలనీ మస్జిద్, పరిటాల జామియా మసీద్ కమిటీ సభ్యులు అబ్బాసి ర్యాలీలో పాల్గొని మహమ్మద్ ప్రవక్త బోధన గురించి వివరించారు. **నందిగామ:** నందిగామ పురవీధుల వెంట భారీ ర్యాలీ నిర్వహించారు. గాంధీ సెంటర్ వద్ద షర్బత్ పంపిణీ చేశారు. అనంతరం ప్రతిభ స్కూల్స్ నందు రక్తదాన శిబిరం నిర్వహించారు. **వన్‌టౌన్:** విజయవాడ పంజా సెంటర్‌లో భారీ బహిరంగ సభ జరిగింది. ఈ సభలో ముస్లిం సోదరులు పాల్గొని మొహమ్మద్ ప్రవక్త సిద్ధాంతాలను ఈ సభ ద్వారా అందరికీ చెప్పటం జరిగింది. ఈ సభలో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొని మత పెద్దలను సత్కరించారు.



కంచికచర్లలో...



వన్‌టౌన్‌లో...

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-వన్‌టౌన్: పశ్చిమ నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ మంజూరు చేయాలని సిపిఎం పశ్చిమ సిటీ కార్యదర్శి, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. సిపిఎం పశ్చిమ నగర కమిటీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి పశ్చిమ నగర ప్రజానీకం తరపున డిగ్రీ కాలేజీ నిర్మాణం కోసం గురువారం వన్‌టౌన్ నెహ్రూ బొమ్మసెంటర్లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బోయి సత్యబాబు మాట్లాడుతూ విద్యాధరపురం లేబర్ డిపార్ట్మెంట్ స్థలంలో కాలేజీ నిర్మాణం చేయాలని, ప్రజల ఆస్తులు ప్రజా ఉపయోగాలకు వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు సూరిబాబు, జి. ఆదిలక్ష్మి, నగర కమిటీ సభ్యులు ఇ.వి. నారాయణ, ఎస్. సుబ్బారెడ్డి, రాజు, అంజిబాబు, ఎస్కే చినబాబు, రాజేష్, పి.సూరిబాబు పాల్గొన్నారు.



నెహ్రూ బొమ్మ సెంటర్‌లో ధర్నాచేస్తున్న సిపిఎం నాయకులు

పశ్చిమలో అభివృద్ధి శూన్యం : పెందుర్తి

ప్రజాశక్తి-వన్‌టౌన్: ప్రజాసంకల్ప యాత్రలో హామీలు కురిపించి, అధికారంలోకి వచ్చి



నాలుగేళ్లలో పశ్చిమ నియోజకవర్గానికి సిఎం జగన్, ఎమ్మెల్యే వెలంపల్లి ఏమి చేశారో చెప్పాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెందుర్తి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. 55వ డివిజన్ వించిపేట టిడిపి కార్యాలయంలో స్థానిక డివిజన్ అధ్యక్షులు వడ్డాది రమణతో కలిసి గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొండ ప్రాంత ప్రజలకు శాశ్వత ఇళ్లపట్టాలు పంపిణీ, కరకట్ట ప్రాంత ప్రజలకు ఇళ్ళ పట్టాలు మంజూరు, ఎర్రకట్ట విస్తరణ, స్టేడియం నిర్మాణం, హజ్ హౌజ్ నిర్మాణం అన్నీ హామీలు నెరవేర్చడంలో ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే వైఫల్యం చెందారన్నారు. రాజరాజేశ్వరిపేట రైల్వే కట్ట ప్రాంతం 990 కుటుంబాల నివాసాల స్థల వివాదం హామీపై పరిష్కారం చూపకపోతే ఇప్పటికీ మూడు సార్లు ఎంపి కేశినేని శ్రీనివాస్ చొరవతో రైల్వేశాఖ మంత్రి సానుకూలతతో ఆ కుటుంబాలు అక్కడే నివసిస్తున్నాయని గుర్తు చేశారు. దుర్గగుడిలో వెండి సింహాల దొంగలను పట్టుకోలేకపోయారన్నారు. బరం పార్క్ తాకట్టు పెట్టి రూ.149 కోట్లు తెచ్చి ఒక్క అభివద్ది పని చేయలేదని ఆరోపించారు. పశ్చిమ నియోజకవర్గం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాకే సిఎం జగన్ ఈ నియోజక వర్గంలో అడుగుపెట్టాలని డిమాండ్ చేశారు.